ప్రజాశక్తి

గురువారం 1 జూన్ 2023 8 పేజీలు





గుంటూరు పల్నాడు

మిర్చి యార్డు చైర్మన్ నియామకంపై ప్రతిష్టంభన

- సిఎం కార్యాలయం నుంచి రాజనారాయణ పేరు ప్రతిపాదన
- పాలక మండలితో కలిపి ప్రతిపాదించాలని వెనక్కి పంపిన మార్కెటింగ్ శాఖ



ప్రజాశక్తి - గుంటూరు జిల్లాప్రతినిధి

ఆసియా ఖండంలోనే అతి పెద్దదైన గుంటూరు మిర్చి యార్డు చైర్మన్‌గా వైసిపి రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ నియామకానికి రంగం సిద్ధమైంది. ఏడాదికి రూ.6వేల కోట్ల లావాదేవీలు జరిగే మిర్చి యార్డు చైర్మన్ పోస్టుకు అధికార పార్టీలో డిమాండ్ ఏర్పడింది. 2020 నుంచి మూడేళ్లపాటు చంద్రగిరి ఏసురత్నం కొనసాగారు. ఇటీవల ఆయన ఎమ్మెల్సీగా ఎన్నిక కావడంతో ఈ రెండు నెలలపాటు వైస్ చైర్మన్ సుధాకర్‌రెడ్డిని తాత్కాలిక చైర్మన్‌గా కొనసాగించారు. యార్డు పాలకవర్గం పదవీకాలం మే 25తో ముగిసింది. చైర్మన్‌గా నిమ్మకాయల రాజనారాయణను ప్రతిపాదిస్తూ రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబుతో పాటు పలువురు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సిఎం వైఎస్ జగన్‌కు సిఫార్సు లేఖలు ఇచ్చారు. సిఎం ఆదేశాలతో రాజనారాయణ చైర్మన్‌గా నియమించాలని సిఎం కార్యాలయ కార్యదర్శి కె.ధనుంజయ్‌రెడ్డి రాష్ట్ర మార్కెటింగ్ శాఖ ముఖ్య కార్యదర్శికి రెండ్రోజుల క్రితం లేఖ రాశారు. ఈ లేఖను పరిశీలించిన మార్కెటింగ్ శాఖ ముఖ్యకార్యదర్శి యార్డు పాలక మండలి పదవీ కాలం పూర్తయినందున చైర్మన్ ఒక్కరినే నియమించడం సరికాదని, మొత్తం పాలక మండలిని సిఫార్సు చేయాలని తిప్పి పంపారు. దీంతో రాజనారాయణ చైర్మన్‌గా నియామక ప్రక్రియ తాత్కాలికంగా పక్కనపెట్టారు.

యార్డు పరిధిలోని పొన్నూరు, గుంటూరు పశ్చిమ, తూర్పు, ప్రత్తిపాడు ఎమ్మెల్యేలు డైరెక్టర్లుగా సిఫార్సు చేయాల్సి ఉంది. దీంతో వీరంతా సమావేశం నిర్వహించి డైరెక్టర్లును ప్రతిపాదించాలి. యార్డుచైర్మన్ పదవి మూడేళ్ల క్రితం బిసిలకు కేటాయించగా చంద్రగిరి ఏసురత్నం మూడేళ్లు ఈ పదవిలో ఉన్నందున రొటేషన్‌లో ఈ పదవిని జనరల్ కేటగిరిలో ఓసీలకు ఇవ్వాలని కొంతమంది జిల్లా అధికారులపై వత్తిడి తెచ్చారు. ఈ మేరకు గుంటూరు యార్డు చైర్మన్ పదవిని ఓసీకి ఇస్తారని ప్రచారమవడంతో పలువురు పోటీపడ్డారు. సిఎం కార్యాలయం, వైసిపి రాష్ట్ర కార్యాలయం చుట్టూ చక్కర్లు కొట్టారు. ఒకసారి బిసికి కేటాయిస్తే ఐదేళ్లు బిసికి ఉంచాలని మరో గ్రూపు వత్తిడి చేసింది. ఓసీకి కేటాయిస్తే తన నియోజకవర్గం నాయకులకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎమ్మెల్యే మద్దాలి గిరిధర్ జిల్లా నాయకులను, మంత్రులను కోరారు. రాజనారాయణకు ఇవ్వాలని మంత్రి అంబటి రాంబాబు గట్టిగా పట్టుబట్టారు. దీంతో ఆయన సిఫార్సుకు ప్రాధాన్యత ఇచ్చిన సీఎం జగన్.. రాజనారాయణ నియామకం కోసం అధికారులకు ఆదేశాలిచ్చారు. కానీ మొత్తం పాలక మండలిని ప్రతిపాదించాలని మార్కెటింగ్ శాఖ సూచించడంతో ఈ నియామక ప్రక్రియ పెండింగ్‌లో ఉంచారు.

నామినేటెడ్ పదవికి ఏడాది పదవీకాలం మాత్రమే కేటాయిస్తుండగా రాజనారాయణను రెండేళ్ల పాటు చైర్మన్‌గా నియమించాలని సిఎం కార్యాలయం అధికారులు సిఫార్సు చేయడం గమనార్హం. డైరెక్టర్ల ఎంపికపై ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, జిల్లా నాయకుల మధ్య సఖ్యత ఏర్పడి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపితే మొత్తం పాలక మండలిని నియమించే అవకాశం ఉంటుందని, అప్పటి వరకు పాలక మండలి లేనట్టేనని అధికార వర్గాలు తెలిపాయి.



యంత్ర సేవా పథకం లబ్ధిదారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

రేపు గుంటూరుకు సిఎం

ప్రజాశక్తి-గుంటూరు

డాక్టర్ వైఎస్ఆర్ యంత్రసేవ పథకం కింద ట్రాక్టర్లు, హార్వెస్టర్లను రైతులకు అందించే రాష్ట్ర వ్యాప్త కార్యక్రమాన్ని గుంటూరులో శుక్రవారం నిర్వహించనున్నారు. కార్యక్రమానికి రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి హాజరుకానున్నారు. ఈ నేపథ్యంలో గుంటూరు మిర్చియార్డులో ఉంచిన ట్రాక్టర్లు, హార్వెస్టర్లను జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఏలూరు, పశ్చిమ గోదావరి, ఎన్‌టిఆర్, కృష్ణా, గుంటూరు, పల్నాడు, బాపట్ల, ప్రకాశం జిల్లాలకు సంబంధించి జిల్లాల వారీగా ట్రాక్టర్లను వరుస క్రమంలో ఉంచాలన్నారు. లబ్ధిదారులకు, వాహన డ్రైవర్లకు బస ఏర్పాట్లు, అల్పాహారం, మధ్యాహ్న భోజనం, తాగునీరు, రాత్రి భోజనం సకాలంలో అందించాలని చెప్పారు. వీరికి అసౌకర్యమేమీ కలగకుండా చూడాలన్నారు. పరిశీలనలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎం.వెంకటశివరామిరెడ్డి, జెడ్పీ సిఇఒ జె.మోహన్‌రావు, డిఆర్‌డిఎ పీడీ హరిహరనాథ్, జిల్లా వ్యవసాయ అధికారి ఎన్.వెంకటేశ్వర్లు, మార్కెటింగ్ ఏడీ రాజబాబు, డిపిఒ కేశవరెడ్డి, డిసిఒ వీరాచారి పాల్గొన్నారు.



ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

సిఎం జగన్ పర్యటన బందోబస్తుపై జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ సమీక్షించారు. తొలుత హెలిపాడ్ వద్ద స్థలాన్ని పరిశీలించారు. హెలిప్యాడ్ చుట్టూ కట్టుదిట్టమైన భారీ కేడింగ్ ఏర్పాటు చేసి, తగినంత మంది సిబ్బందితో పటిష్టమైన బందోబస్తు ఏర్పాటు చేయాలని చెప్పారు. హెలిప్యాడ్ నుండి చుట్టుగుంట సర్కిల్ వరకు రోడ్డుకిరువైపులా భద్రతా బలగాలతో అణువణువు ముమ్మర తనిఖీలు నిర్వహించాలన్నారు.



సమీక్షలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి

తాగునీటి సమస్య రానివ్వొద్దు

ప్రజాశక్తి-గుంటూరు

వేసవి నేపథ్యంలో ప్రజలకు ఎక్కడా తాగునీటి సమస్య లేకుండా చూడాలని, అవసరమైతే ట్యాంకర్ల ద్వారా సరఫరా చేయాలని అధికారులను గుంటూరు జిల్లా కలెక్టర్ ఎం.వేణుగోపాల్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం రాత్రి కలెక్టరేట్‌లోని వీసీ సమావేశ మందిరం నుండి సంయుక్త కలెక్టర్ జి.రాజకుమారితో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ప్రత్యేక అధికారులు, ఎంపిడిఒలు, తహశీల్దార్లు, గ్రామ, వార్డు సచివాలయ సిబ్బంది బదిలీలు, గడప గడపకు మన ప్రభుత్వం, జల జీవన్‌మిషన్, జగనన్నకు చెబుదాం, ఉపాధి హామీ పనులు, ఫించన్ల పంపిణీ అంశాలపై వీడియో కాన్ఫరెన్స్ ద్వారా కలెక్టర్ ▸ 2లో

నూనె మిల్లుల్లో తనిఖీలు

ప్రజాశక్తి - నరసరావుపేట

పట్టణంలోని చిలకలూరిపేట రోడ్డులోని చాముండేశ్వరి ఆయిల్ మిల్, సోమశ్రీ ట్రేడర్స్ వంట నూనెల మిల్లులపై పల్నాడు జిల్లా ఆహార భద్రతా, పౌరసరఫరాల శాఖాధికారులు బుధవారం తనిఖీలు చేశారు. వేరుశనగ నూనె, ప్రొద్దుతిరుగుడు విత్తనాల నూనెలను టన్నుల కొద్దీ నిల్వలు టోకుగా కొనుగోలు చేసి వివిధ బ్రాండ్ల పేరుతో ప్యాకింగ్ చేసి అమ్ముతున్నట్లు సమాచారం నేపథ్యంలో తనిఖీలు చేపట్టినట్లు జిల్లా ▸ 2లో



నూనె నమూనాలను సేకరిస్తున్న అధికారులు

ట్రాక్టర్‌తో ఢీకొట్టి సోదరుని హత్య

ప్రజాశక్తి - మాచర్ల



హత్యకు గురైన కాశిరెడ్డి (ఫైల్)

ఆస్తి వివాదాల నేపథ్యంలోఅన్నను తమ్ముడు హతమార్చిన ఘటన మండలంలోని జమ్మలమడకలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. జమ్మలమడక గ్రామానికి చెందిన చల్ల కాశిరెడ్డి (45), పార్వతిరెడ్డి సోదరుల మధ్య కొంతకాలంగా పొలం వివాదాల వల్ల గొడవలవుతున్నాయి. ఈ క్రమంలో కాశిరెడ్డి, గ్రామానికి చెందిన గాదె వెంకటరెడ్డి కలిసి మాచర్లకు పురుగుల మందు కొనుగోలుకు మంగళవారం ద్విచక్ర వాహనంపై వెళ్లాడు. తిరిగి రాత్రి 10 గంటలకు ఇద్దరూ వస్తుండగా గ్రామ శివారులోని నాగార్జున సాగర్ కుడికాల్వ బొంబాయి కంపెనీ బ్రిడ్జి సమీపంలో పార్వతిరెడ్డి, అతని బావమరిది గోగు సీతారామిరెడ్డి కలిసి ద్విచక్ర వాహనాన్ని ట్రాక్టర్‌తో ఢీకొట్టారు. బైక్‌ను నడుపుతున్న కాశిరెడ్డి, వెనకకూర్చున్న వెంకటరెడ్డి కిందపడిపోయారు. అనంతరం కాశిరెడ్డి తలను పగలగొట్టి హత్య చేసి వెళ్లిపోయారు. అటుగా వెళ్తున్నవారు ఇది గమనించి 108కు సమాచారం ఇవ్వగా వారొచ్చి కాళ్లు విరిగి ▸ 2లో



స్పీకర్ తమ్మినేని సీతారాం దిష్టిబొమ్మను దహనం చేస్తున్న టిడిపి నాయకులు

'స్పీకర్ తమ్మినేనిని బర్త్ రఫ్ చేయండి'

ప్రజాశక్తి-నరసరావుపేట

టిడిపి జాతీయ అధ్యక్షులు మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుపై సభాపతి తమ్మినేని సీతారాం వాఖ్యలు క్షమించరానివని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు అన్నారు. స్పీకర్ వాఖ్యలను నిరసిస్తూ స్థానిక మల్లమ్మ సెంటర్ లో బుధవారం తమ్మినేనిని దిష్టి బొమ్మను, సీఎం జగన్, మంత్రి అంబటి ఫ్లెక్సీలను దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు.ఈ సందర్భంగా కోటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన దగ్గర నుంచి అరాచకాలు, దౌర్జన్యాలు, కూల్చటాలు, ప్రజలు నడిచే రహదారులపై కూడా గోడలు కట్టి, నడవనీయకుండా చేసిన ఎన్నో సంఘటనలు ప్రజలు చూశారన్నారు. ఈ విషయాలన్నింటిని ప్రజలకు ఎప్పటికప్పుడు తెలియజేస్తున్న చంద్రబాబుని హతమార్చాలన్న దురుద్దేశంతో అనేక సార్లు, రాళ్లు వేయటం, కుట్రలు చేయడం చూశామన్నారు. సభాపతి స్థానాన్ని మరచిపోయి చంద్రన్నను ఫినిష్ చేస్తాననడం రాష్ట్రంలోని దివ్యాంగులు కలత చెందుతున్నారని, అటువంటి చంద్రబాబుని రాష్ట్ర ముఖ్యమంత్రి, మంత్రులు, స్పీకర్ కలిసి చంద్రబాబుని హతమార్చాలని చూస్తున్నారని ఆరోపించారు. రాష్ట్ర డిజిపి వెంటనే స్పీకర్ మాటలను సుమోటోగా తీసుకోని,చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలని, ఆయనను బర్త్ రఫ్ చేయాలని డిమాండ్ చేశారు. టిడిపి రాష్ట్ర విభిన్న ప్రతిభావంతుల ప్రధాన కార్యదర్శి చిలిముల దుర్గారావు, విభిన్న ప్రతిభావంతుల నాయకులు నూకల వెంకటేశ్వర్లు, అంజి నాయక్, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

' గిరిజన జాబితాలో ఇతర కులాలను చేర్చొద్దు'

ప్రజాశక్తి - వినుకొండ

గిరిజన జాబితాలో వాల్మీకులను చేర్చవద్దని గిరిజన రిజర్వేషన్ పరి రక్షణ కమిటీ రాష్ట్ర కన్వీనర్ వీకోట నాయక్ డిమాండ్ చేశారు. ఈ నేపథ్యంలో జూన్ 4వ తేదీన పల్నాడు జిల్లా నరసరావుపేట లోని ఏంజెల్ టాకీస్ వద్ద సిపిఐ కార్యాలయంలో జరగనున్న చర్చ గోష్టి రౌండ్ టేబుల్ సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం ఏవో కార్యాలయం వద్ద కరపత్రాలు ఆవిష్కరించారు. వాల్మీకులను ఎస్టీ జాబి తాలో చర్చి నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే వెనక్కి తీసుకోవాలని లేదంటే ఉద్యమం ఉధతం అవుతుందని రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో సదస్సులు సమావేశాలు జరుగుతున్నట్లు తెలిపారు.

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత

ప్రజాశక్తి-ఈపూరు

పర్యావరణ పరిరక్షణ అందరి బాధ్యత అని ఫారెస్ట్ బీట్ ఆఫీసర్ ఎ.నాగేశ్వరావు అన్నారు. మండలంలోని భద్రుపాలెం గ్రామంలో పర్యావరణ పరిరక్షణపై గ్రామ ప్రజలకు బుధవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఫారెస్ట్ అధికారులు మాట్లాడుతూ అడవులను సంరక్షించుకోవాలని అడవులు అంతరిస్తే తీవ్ర వర్షాభావ పరిస్థితులు ఏర్పడతాయన్నారు. అడవులకు నిప్పు పెట్టరాదన్నారు. అనం తరం గ్రామ ప్రజలచే పర్యావరణ హిత జీవనశైలి పై ప్రతిజ్ఞ చేయించారు. కార్యక్రమంలో ఫారెస్ట్ బీట్ అధికారులు ఎస్ వెంకటేశ్వర్లు, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ప్రజాశక్తి-దుర్గి

దుర్గి మండల పరిధిలో ని ఓబులేశునిపల్లె గ్రా మ బొడ్రాయివార్షికో త్సవం గ్రామ ప్రజలు ఘనంగా నిర్వహించారు. అనంతరం అన్న దాన కార్యక్రమం నిర్వ హించారు.

ఆరోపణలకు బెదరం

మున్సిపల్ కౌన్సిల్ సమావేశంలో మంత్రి అంబటి రాంబాబు

ప్రజాశక్తి - సత్తెనపల్లి టౌన్

జనసేన, మరికొన్ని పార్టీలు తనపై అసత్య ఆరోపణలే లక్ష్యంగా ప్రచారం చేస్తున్నాయని, అయినా తాను వేటికీ బెదిరేది లేదని రాష్ట్ర నీటిపారుదల శాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. మున్సిపల్ కౌన్సిల్ సమావేశం చైర్‌పర్సన్ చల్లంచర్ల లక్ష్మీ తులసి సాంబశివరావు అధ్యక్షతన కౌన్సిల్ హాలులో బుధవారం నిర్వహించారు. 26 అంశాలతో కూడిన అజెండాను కౌన్సిల్‌లో ప్రవేశపెట్టగా జనసేన కౌన్సిలర్ ఆర్.సుమన్ మాట్లాడుతూ నీటి శుద్ధి ప్లాంటు ఏర్పాటుకు భూసేకరణకు రూ.కోట్లు ఏమిటని ప్రశ్నించగా కమిషనర్ షమ్మీ వివరించారు. అనంతరం మంత్రి మాట్లాడుతూ మురుగు నీటిని శుద్ధి చేసే ప్లాంట్‌ను స్వచ్ఛంధ్ర కార్పొరేషన్ పర్యవేక్షణలో చేపట్టనున్నట్లు చెప్పారు. మంచి పనులను ఎలా అడ్డుకోవాలా? అని ఆలోచనలు సరికావని, ఇప్పటికే కొన్ని పార్టీలు వారి అనుకూల మీడియాలో ఆరోపణలు చేస్తున్నాయని అన్నారు. ఇలాంటి ఆరోపణలు బయటే చేసుకోవాలిగాని సమావేశాల్లో వద్దని జనసేన కౌన్సిలర్‌ను వారించారు. అనంతరం ఎజెండాను ఆమోదించారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అంబటి రాంబాబు

పచ్చిరొట్ట విత్తనాలు సరఫరా చేస్తున్నాం కావాలంటే ఇంకా తెప్పిస్తాం

పల్నాడు జిల్లా వ్యవసాయ సలహా మండలి సమావేశంలో అధికారులు

ప్రజాశక్తి - నరసరావుపేట

రైతులకు 50 శాతం రాయితీపై పచ్చిరొట్ట విత్తనాలు రైతు భరోసా కేంద్రాల ద్వారా సరఫరా చేస్తున్నామని, రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని పల్నాడు జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఐ.మురళి అన్నారు. జిల్లా స్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశం కలెక్టరేట్‌లో బుధవారం నిర్వహించారు. సమావేశానికి చైర్మన్ కె.సాయిమార్కం డేయరెడ్డి అధ్యక్షత వహించారు. జిల్లా వ్యవసాయాధికారి మాట్లాడుతూ అన్ని రైతు భరోసా కేంద్రాల ద్వారా పచ్చిరొట్ట విత్తనాలను 50 శాతం రాయితీపై అందిస్తామన్నారు. ఇప్పటివరకు 350 టన్నులు సరఫరా అయ్యాయని, ఇంకా చేస్తామని చెప్పారు. గ్రామ సచివాలయ ,రైతు భరోసా కేంద్రాల ద్వారా గోదాముల్లో 10-20 మెట్రిక్ టన్నుల ఎరువులను, రానున్న ఖరీఫ్ సీజన్‌కు మార్క్‌ఫెడ్ ద్వారా వివిధ రకాల ఎరువులు నిల్వ చేసుకున్నట్లు చెప్పారు. జిల్లాలో 137 కమిటీ హైరింగ్ సెంటర్లకు మెగామేళా-2 ద్వారా 137 ట్రాక్టర్లు, వివిధ రకాల యంత్ర పరికరాలను సిఎం ద్వారా త్వరలో అందిస్తామన్నారు. అనంతరం వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు 2023-24 ప్రణాళికను వివరించారు. చైర్మన్ మాట్లాడుతూ వ్యవసాయ యంత్ర పరికరాలు రైతులకు వ్యక్తిగతంగా రాయితీపై అందించాలని, రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు ఎరువులు రైతులకు సరఫరా చేయాలని, కౌలు రైతులను గుర్తించి కార్డులు ఇవ్వాలని కోరారు. సమావేశంలో ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ, జిల్లా రెవిన్యూ అధికారి వినాయకం పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సలహా మండలి సభ్యులు నెల్లూరి సాంబశివరావు



సమావేశంలో మాట్లాడుతున్న తహశీల్దార్

సిసిఆర్‌సి కార్డుల కోసం దరఖాస్తు చేసుకోండి

ప్రజాశక్తి-ముప్పాళ్ల

మండలంలోని చాగంటివారిపాలెం, ముప్పాళ్ల గ్రామాల్లో పంట సాగు హక్కు పత్రాలపై బుధవారం గ్రామసభ నిర్వహించారు. కార్యక్రమంలో తహశీల్దార్ భవానీ శంకర్ మాట్లాడుతూ కౌలురైతులు సిసిఆర్‌సి కార్డులు పొందడానికి దరఖాస్తు చేసుకోవాలని, వీటి వల్ల భూయ జమాని హక్కులకు ఇబ్బందేమీ రాదని చెప్పారు. గుర్తింపు కార్డు పొందిన కౌల్దార్లకు ప్రభుత్వ ప్రోత్సాహకాలు అందుతా యన్నారు. కార్యక్రమంలో సర్పంచ్‌లు ఎం.సతీష్, పి.గాయత్రీ లక్ష్మణ్, ఆర్ఐ పవన్‌కుమార్, విఆర్వోలు అశోక్, మాబువలి, అగ్రికల్చర్ అసిస్టెంట్లు పావని, శైలజ పాల్గొన్నారు.

'డబ్బులున్నపుడు ఇళ్లు కట్టుకుంటాం'

ప్రజాశక్తి-ప్రత్తిపాడు

తమ వద్ద డబ్బులు ఉన్నపుడు ఇళ్లు కట్టుకుంటామని, తమను ఒత్తిడి చేయొద్దని లబ్ధిదారులు చెబుతున్నారని పత్తిపాడు సచివాలయం ఎఈ లు డిపిఒకి తెలిపారు.బుధవారం మండల పరిషత్ కార్యాలయం లో ఎంపీడీవో శ్రీరమ్య అధ్యక్షతన హౌసింగ్ పై సమీక్షా సమావేశం జరిగింది.ఈ సందర్భంగా సచివాలయం ఏఈలను ఇచ్చిన టార్గెట్ వరకు పూర్తి చేయాలని, వంద శాతం కావడం లేదని, ప్రత్తిపాడు మండలం 56 శాతం లోనే ఆగి ఉందని డిపిఒ అన్నారు. దీనిపై ప్రత్తిపాడు సచివాలయ ఎఇ లు మాట్లాడుతూ టార్గెట్ పూర్తి చేసేందుకు ప్రయత్నిస్తున్నామని, ఇప్పటికే 75 శాతం పూర్తి చేశామని అన్నారు. డిపిఒ స్పందిస్తూ 'ముందు మీరు మారాలి. ఆ తర్వాత లబ్ధిదారులను మార్చాలి. అన్ని డబ్బులతోనే ముడిపడి ఉంటాయి' అని అన్నారు. ఎంపీడీవో శ్రీరామ్ మాట్లాడుతూ ఒక టీం గా పని చేస్తే మంచి గ్రోత్ వస్తుంది అందరికీ పేరు కూడా వస్తుందని అన్నారు. కార్యక్రమంలో హౌసింగ్ ఏఈ సురేష్ పి ఆర్ ఏఈ కిషోర్, ఈవోపీఆర్డి మోషే, ఏపిఎం సురేష్ పాల్గొన్నారు.



పొగాకు నివారణా దినోత్సవం

ప్రజాశక్తి-పిడుగురాళ్ళ

ప్రతి ఒక్కరూ పొగాకు నివారణ చర్యలను పాటించేలా చూడలని జిల్లా మలేరియాశాఖ అధికారి రవీంద్ర రత్నాకర్ అన్నారు. బుధవారం పట్టణంలోని మార్కెట్ యార్డులోని ప్రాథమిక వైద్యశాలలో పొగాకు నివారణ దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాటాడుతూ ప్రతి సంవత్సరం పొగాకు వినియోగం వలన వేలాది మంది ప్రజలు చనిపోతున్నారని, పొగాకు వినియోగం వల్ల కలిగే ఆనారోగ్య సమస్యల గురించి తెలిపేలా అవగాహన చర్యలు చేపట్టాలని సూచించారు.

తాగునీటి సమస్య రానివ్వొద్దు

(మొదటి పేజీ తరువాయి)

సమీక్షించారు. గ్రామ/వార్డు సచివాలయ ఉద్యోగుల బదిలీలకు సంబంధించి దరఖాస్తు చేసుకోవడానికి జూన్ 3వ తేదీ వరకూ గడువు నిర్ణయించినందున ఆ మేరకు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు చేసుకునేలా సిబ్బందికి తెలపాలన్నారు. దరఖాస్తులను నిబంధనల మేరకు పరిశీలించి బదిలీలకు చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు కోరుకునే వారికి సంబంధించి నో డ్యూ సర్టిఫికెట్లను సంబంధిత ఎంపిడిఒలు, మున్సిపల్ కమిషనర్లు జారీ చేయాల్సి ఉంటుందని, క్షేత్రస్థాయి, మండలాధికారులు, మున్సిపల్ కమిషనర్లు తప్పక సచివాలయాలను తనిఖీలు చేపట్టాలని చెప్పారు. జల జీవన మిషన్ కింద పురోగతి ఆశించిన స్థాయిలో లేదని, పనులు వేగవంతం చేయాలని ఆదేశించారు. ప్రధాన మంత్రి ఆవాస్ యోజన కింద నిర్మాణ పనులు వేగవంతం చేయాలని సూచించారు. గృహనిర్మాణ కాలనీల వద్ద ప్రవేశ ద్వారాల నిర్మాణ పనులు వేగవంతం చేయాలన్నారు. జగనన్నకు చెబుదాం ద్వారా అందిన పెండింగ్ ఫిర్యాదులపై శాఖల వారీగా జెసి సమీక్షించారు. జిల్లా గ్రామీణాభివృద్ధి సంస్థ ప్రాజెక్టు డైరెక్టర్ హరిహరనాథ్ మాట్లాడుతూ వేసవిలో ఎండలు తీవ్రంగా ఉన్నందున జూన్ 1న సామాజిక పింఛన్లు తెల్లవారుజామునే పింఛనుదారులకు అందించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ కె.చంద్రశేఖరరావు, జెడ్పీ సిఇఒ జె.మోహన్‌రావు, ఐసీడీఎస్ పీడీ మనోరంజని పాల్గొన్నారు.

నూనె మిల్లుల్లో తనిఖీలు

(మొదటి పేజీ తరువాయి)

ఆహార భద్రతా తనిఖీ అధికారి సిహెచ్ లక్ష్మీనారాయణ చెప్పారు. ఆయా మిల్లులలో నిల్వలు రికార్డులను పరిశీలించి నూనెల నమూనాలు సేకరించి పరీక్షల నిమిత్తం హైదరాబాద్ ల్యాబ్‌కు పంపినట్లు తెలిపారు. నాణ్యత లోపాలుంటే మిల్లులను సీజ్ చేసి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వేర్వేరు పేర్లతో ప్యాకింగ్ అంశంపై మాట్లాడుతూ ఏ పేరుతోనైనా ప్యాకింగ్ చేసుకోవచ్చని, నాణ్యత మాత్రం ఉండాలని చెప్పారు. మిల్లులపై నిత్యం నిఘా, తనిఖీలు ఉంటాయని అన్నారు. తనిఖీల్లో పౌరసరఫరా శాఖ డిప్యూటీ తహశీల్దార్ టి.కొండారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ట్రాక్టర్‌తో ఢీకొట్టి సోదరుని హత్య

(మొదటి పేజీ తరువాయి)

పడిఉన్న వెంకటరెడ్డిని మాచర్ల ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక వైద్యం అనంతరం నరసరావుపేటకు తీసుకెళ్లారు. ఇదిలా ఉండగా మృతుడు కాశిరెడ్డి 2015లో తన తమ్ముడు పార్వతిరెడ్డిని ఇదేవిధంగా ట్రాక్టర్‌తో ఢీకొట్టి హత్య చేయబోయాడు. అప్పుడు పార్వతిరెడ్డి రెండు కాళ్లూ విరిగిపోయాయి. అప్పటి నుండి వివాదాలు కొనసాగుతూనే ఉండగా పార్వతిరెడ్డి తన కుటుంబం సహా మాచర్ల వెళ్లి ఉంటున్నాడు. తాజా ఘటనపై సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలిని పరిశీలించారు. మృతుని భార్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు. మృతదేహానికి మాచర్ల ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం అనంతరం కుటుంబానికి అప్పగించారు. మృతునికి భార్య ఇద్దరు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. ఇదిలా ఉండగా మృతుడు కాశిరెడ్డి, నిందితుడు పార్వతిరెడ్డి ఇద్దరూ మాజీ ఎమ్మెల్యే చల్లా నారపరెడ్డి మనుమళ్లు.



బహుమతులు ప్రదానం చేస్తున్న మేయర్

ఎన్‌టిఆర్ స్టేడియంలో ముగిసిన సమ్మర్ క్యాంపు

ప్రజాశక్తి-గుంటూరు

స్థానిక ఎన్‌టిఆర్ స్టేడియంలో నెలరోజులపాటు నిర్వహించిన సమ్మర్ కోచింగ్ క్యాంప్ బుధవారం ముగిసింది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో క్రీడాకారులకు, విద్యార్థులకు మేయర్ చేతులమీదుగా ప్రశంసాపత్రాలు అందజేశారు. ఈ క్యాంప్‌లో 851 మంది శిక్షణలో పాల్గొని, ప్రతి క్రీడాంశంలో ప్రతిభ చూపిన వారికి మేయర్ బహుమతులు ప్రదానం చేశారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ ఎన్‌టిఆర్ స్టేడియంలో నూతన జిమ్ భవనాన్ని నిర్మాణం చేస్తున్నామని, దాంతోపాటు వాకింగ్‌ట్రాక్, అలాగే స్టేడియంలో ఇతర అభివృద్ధి కార్యక్రమాలూ చేపడుతున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో కార్పొరేటర్ గోపీ శ్రీనివాస్, డిప్యూటీ కమిషనర్ సిహెచ్.శ్రీనివాస్, కోచ్‌లు, క్రీడాకారులు తదితరులు పాల్గొన్నారు.

అలరించిన సాహితీ కదంబం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో స్థానిక బృందావన్ గార్డెన్స్, అన్నమయ్య కళావేదికపై బుధవారం సాహితీ కదంబం నిర్వహించారు. వర్ధమాన నాట్యమయూరి నాగజ్యోతి నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది. విశ్రాంత డిఎస్‌పి డాక్టర్ గంటెల రవికుమార్ మహాభారతం, మయసభ ఏకపాత్రాభినయం, పౌరాణిక నటులు తేళ్ళ రామారావు పద్యగానం అలరించాయి. ఈ సందర్భంగా జిల్లా రచయితల సంఘం అధ్యక్షులు సోమేపల్లి వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ గద్య, పద్య కవితలు, నానిల సాహిత్యం ద్వారా వర్తమాన రచయితలను ప్రోత్సహించటం, కళారూపాల ద్వారా కళాకారుల్లో ఉన్న సృజనాత్మకతను వెలికి తీయటానికి రచయితల సంఘం ప్రోత్సహిస్తుందని వివరించారు. సారస్వత కళానిధి డాక్టర్ వెలువోలు నాగరాజ్యలక్ష్మి సభా నిర్వహణ చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు చిటిపోతు మస్తానయ్య, సహాయ కార్యదర్శి ఊటుకూరి నాగేశ్వరరావు, రచయితల సంఘం ప్రధాన కార్యదర్శి ఎస్.ఎం.సుభానీ, కోశాధికారి నానా, నారిశెట్టి గాయత్రి పలువురు సాహితీవేత్తలు పాల్గొన్నారు.



సాహితీ కదంబంలో పాల్గొన్న కళాకారులు

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రజాశక్తి - ఫిరంగిపురం : ద్విచక్రవాహనంపై వస్తున్న భార్యభర్తలను వేగంగా వస్తున్న కారు ఢీకొనడంతో భార్య మృతి చెందగా భర్తకు స్వల్ప గాయాలయ్యాయి. బుధవారం చోటు చేసుకున్న ఈ సంఘటనలో మద్ది నాగలక్ష్మి (39) మృతి చెందారు. ఫిరంగిపురం ఎస్ఐ లక్ష్మీనారాయణ రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం విజయవాడ నుండి ద్విచక్ర వాహనంపైన భార్య,భర్తలు మద్ది కిషోర్, నాగలక్ష్మీ నరసరావుపేట వెళు తున్నారు. ఫిరగింపురం కర్నూలు హైవే నుదురుపాడు రైల్వే స్టేషన్ వద్ద నరసరావుపేట నుండి గుంటూరు వెళుతున్న వేగంగా ద్విచక్రవాహనాన్ని ఢీకొంది. సంఘటనలో తీవ్రంగా గాయపడిన నాగలక్ష్మీని నరసరావుపేట వైద్యశాలకు తరలించారు. పరిస్థితి మిషమించి ఆమె మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. సంఘటనా స్థలాని పరిశీలించి కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.



టిడిపి మేనిఫెస్టోను ప్రజలు నమ్మరు : డొక్కా

గుంటూరులో వైసిపి నేతల నిరసన

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

గుంటూరులోని లాడ్జి సెంటర్ వద్ద నిన్ను నమ్మం బాబు, మీ దొంగ హామీలు నమ్మం అనే నినాదంతో వైసిపి నాయకులు బుధవారం నిరసన తెలిపారు. వైసిపి జిల్లా అధ్యక్షులు డొక్కా మాణిక్య వర ప్రసాద్ మాట్లాడుతూ చంద్రబాబు ప్రకటించిన మేనిఫెస్టో ఏ తరగతి ప్రజలను సంతృప్తి పర్చలేకపోయిందన్నారు. మహిళలను మభ్య పెట్టేందుకు ఆరు పథకాలతో మేనిఫెస్టో ప్రకటించారని తెలిపారు. ఎస్‌సి. ఎస్‌టి, బిసి, మైనార్టీ మహిళలకు చేయూత పథకం ద్వారా రూ.18,750 ఒకే సారి వారి ఖాతాల్లో జమచేస్తున్నారని, కాపు, ఈబిసి నేస్తం పథకాలు కూడా అగ్రకుల మహిళలకు అందిస్తున్నారని అన్నారు. ఇలాంటిది నెలకు రూ.1500 ఇస్తామనడం మోసం చేయడమే అన్నారు. ఎమ్మెల్సీ చంద్రగిరి ఏసురత్నం మాట్లాడుతూ ప్రజలకు మేలు చేసేందుకు చంద్రబాబుకు చిత్తశుద్ధి లేదన్నారు. మేయర్ కావటి మనోహర్ నాయుడు మాట్లాడుతూ 2014లో టిడిపి మేనిఫెస్టోలో 600 హామీలు ఇచ్చి 60 కూడా అమలు చేయలేదన్నారు.వైసిపి ఇచ్చిన అన్ని పథకాలను అమలు చేసిందన్నారు. ఎమ్మెల్యే కిలారి రోశయ్య, డిప్యూటీ మేయర్లు వనమా బాల వజ్రబాబు, షేక్ సజీలా, మాజీ డిప్యూటీ మేయర్ తాడిశెట్టి మురళి తదితరులు ప్రసంగించారు.



మాట్లాడుతున్న డొక్కా మాణిక్య వరప్రసాద్

దస్తావేజులు పోయినవి

పల్నాడు జిల్లా సత్తెనపల్లి మండలం, లక్కరాజుగార్లపాడుకు చెందిన గోపిదేశి పెద్దన్న మరియు గోపిదేశి బసవరావు తండ్రి శ్రీరాములుకు చెందిన జాయింట్ దస్తావేజులు పోయినవి. లక్కరాజుగార్లపాడు రెవిన్యూ పరిధిలో సర్వే నెంబర్ 253-1సి2 లో య 1.12 సెంట్లు వ్యవసాయ భూమికి సంబంధించిన దస్తావేజులు పోయినవి. సదరు దస్తావేజు నెంబర్ 4266/1984, 15-05-2023 తేదీన ద్విచక్ర వాహనం పై సత్తెనపల్లి నుండి నరసరావుపేట వెళుతుండగా మార్గమధ్యంలో ముప్పాళ్ళ మండలం గోళ్ళపాడు సమీపంలో పోయినవి. దొరికిన వారు ఈ క్రింది చిరునామాకు తెలియపరచగలరు.స్వయంగా తెచ్చిచిన వారికి తగిన పారితోషికం ఇవ్వబడును.

ఇట్లు
గోపిదేశి పెద్దన్న
గోపిదేశి బసవరావు
తండ్రి శ్రీరాములు
లక్కరాజుగార్లపాడు,
సత్తెనపల్లి మండలం,
పల్నాడు జిల్లా.



పోస్టర్ ఆవిష్కరిస్తున్న బొప్పరాజు వెంకటేశ్వర్లు, ఇతర నాయకులు

8న గుంటూరులో ప్రాంతీయ సదస్సు

- ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు

ప్రజాశక్తి-గుంటూరు

ఉద్యోగుల న్యాయమైన డిమాండ్ల సాధనకు గత 84 రోజులుగా చేస్తున్న పోరాటాలకు స్పందించకుండా, ఇంకా నిర్లక్ష్యం చేస్తే జూన్ 10న రాష్ట్ర కార్యవర్గంలో చర్చించి, భవిష్యత్ కార్యక్రమాలను సిఐటియు, ఎఐటియుసి వంటి కార్మిక సంఘాలతో కలిసి ప్రత్యక్ష కార్యాచరణకు వెళతామని ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు అన్నారు. జెఎసి ఉద్యమ కార్యాచరణలో భాగంగా ఈనెల 8న గుంటూరులో నిర్వహిస్తున్న 4వ ప్రాంతీయ సదస్సు పోస్టర్‌ను బొప్పరాజు వెంకటేశ్వర్లు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పి.దామోదరరావు బుధవారం కలెక్టరేట్ ప్రాంగణంలో ఉద్యోగులు, నాయకులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బొప్పరాజు మీడియాతో మాట్లాడుతూ జెఎసి రాష్ట్ర కమిటీ తరపున సిఎస్‌కు ఫిబ్రవరి 13న ఇచ్చిన 50 పేజీల మెమోరాండంపై గురువారం సిఎస్ క్యాంపు కార్యాలయంలో ఉదయం 11.30 గంటలకు చర్చలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. 84 రోజుల ఉద్యమం వల్ల ఉద్యోగులకు రావాల్సిన సమారు రూ.6వేల కోట్లు బకాయిలు సాధించుకున్నామని, కారుణ్య నియామకాలు, ఆర్టీసి ఉద్యోగుల సమస్యలు కొన్నింటిని పరిష్కరించుకున్నామని చెప్పారు. సిపిఎస్ ఉద్యోగులకు సంబంధించి ప్రభుత్వం తీసుకున్న రూ.2400 కోట్లు ఇప్పించుకోగలిగామన్నారు. ఇంకా ఉద్యోగులకు రావాల్సిన పిఆర్‌సి, డిఎ బకాయిలు, పెండింగ్ డిఎలలో ఒకటి ప్రకటించినా ఇంకా రెండు డిఎలు రావాల్సి ఉందన్నారు. ఆర్టీసి, మున్సిపల్, సచివాలయాలు, కాంట్రాక్ట్, ఔట్ సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలు ఇంకా పరిష్కారం కాలేదన్నారు. సిఎస్‌కు ఇచ్చిన 50 పేజీల మెమోరాండంలో సమస్యల పరిష్కారంపై స్పష్టత వచ్చే వరకూ ఉద్యమం కొనసాగిస్తామని సెక్రెటరీ జనరల్ దామోదరరావు, అసోసియేట్ ఛైర్మన్ టి.వి.ఫణపేర్రాజు తెలిపారు. కార్యక్రమంలో ఏపిజేఏసి అమరావతి గుంటూరు జిల్లా ఛైర్మన్ కనపర్తి సంగీతరావు, స్టేట్ క్లాస్ 4 ఎంప్లాయిస్ రాష్ట్రఅధ్యక్షులు యస్.మల్లేశ్వర రావు, రిటైర్డు ఎంప్లాయిస్ అసోషియేషన్ నాయకులు సిహెచ్.వెంకటేశ్వర్లు, ఏపి విఆర్ఓ అసోషియేషన్ రాష్ట్రకార్యదర్శి జి.అనుపమ పాల్గొన్నారు.

డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించండి

ప్రజాశక్తి-పిడుగురాళ్ల

రాబోయే వర్షకాలం దృష్టిలో పెట్టుకొని పట్టణంలో డ్రైనేజీ వ్యవస్థపై దృష్టి సారించాలని పిడుగురాళ్ళ మున్సిపల్ ఛైర్మన్ కొత్త వెంకట చిన్న సుబ్బారావు అన్నారు. బుధవారం పట్టణంలోని మున్సిపల్ కార్యలయంలో మన్సిపల్ కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. సమావేశంలో కౌన్సిల్ అజెండా అంశాలను కౌన్సిల్ సభ్యులకు అధికారులు చదివి వినిపించారు. అనంతరం మున్సిపల్ ఛైర్మన్ సుబ్బారావు మాట్లడుతూ గత కొద్ది రోజుల క్రితం కురిసినటువంటి వర్షాలకు పట్టణలో డ్రైనేజీలు సరిగా లేకపోవడంతో రోడ్లపై వర్షపు నీరు నిలిచి పోయి ప్రజలు ఇబ్బందుల పడ్డారని తెలిపారు. రాబోయేది వర్షకాలం కాబట్టి అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. పలువురు కౌన్సిలర్లు మాట్లడుతూ తమ వార్డులలో పలు సమస్యలు ప్రజలు తమ దృష్టికి తీసుకువచ్చారని, స్థానిక సమస్యలను వార్డులలోని మున్సిపల్ అధికారులకు పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు. కౌన్సిల్ అజెండాలోని అంశాలను కౌన్సిల్ సభ్యులు ఆమెదించారు.



జెండా ఊపి ర్యాలీ ప్రారంభిస్తున్న డాక్టర్ గీతాంజలి

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

ప్రజాశక్తి - నరసరావుపేట

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలని, ఇప్పటికే వాటికి బానిసలై అనారోగ్యంతో బాధపడుతున్న వారు శరీరంలో వ్యాధినిరోధక శక్తి పెంచుకునేలా పౌష్టికాహారం తీసుకోవాలని జిల్లా ఇమ్యూనిటీ అధికారి డాక్టర్ గీతాంజలి అన్నారు. బుధవారం ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా పల్నాడు రోడ్డులోని జిల్లా వైద్యారోగ్య శాఖ కార్యాలయం ఆవరణ నుండి అవగాహన ర్యాలీని డాక్టర్ గీతాంజలి ప్రారంభించి మాట్లాడారు. పొగాకు ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, ఖైని వినియోగం వలన నోటి కేన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులు వస్తాయని చెప్పారు. డిప్యూటీ డిఎంహెచ్ఒ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ పొగాకు, సిగరెట్ , బీడీ వంటి వ్యసనాలకు ప్రజల బానిసలు కాకుండా, అనారోగ్య సమస్యలు కొని తెచ్చుకోకుండా తగిన జాగ్రత్తలు పాటించాలని కోరారు. అనంతరం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు అందరితో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞను డీసీఎం/సోషల్ వర్కర్ నందిగం సురేష్ చేయించారు. పల్నాడు బస్టాండ్ వరకు సాగిన ర్యాలీలో ఎఫ్‌డిపి నోడల్ అధికారి డాక్టర్ హనుమకుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగపద్మజ, డాక్టర్ సాంబశివరావు, డాక్టర్ రవీంద్ర రత్నాకర్, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి - పెదకూరపాడు : పొగాకు ఉత్పత్తులు ఆరోగ్యానికి హానికరమని 75తాళ్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు ప్రియాంక అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా ప్రదర్శన నిర్వహించి ర్యాలీ చేశారు. వైద్యులు ప్రియాంక, వెలుగొండరెడ్డి, ఎఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.



ప్రజాశక్తి-ముప్పాళ్ల: మండల కేంద్రంలోని ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల ఆధ్వర్యంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి డాక్టర్ వి.జయకృష్ణ మాట్లాడుతూ ప్రభుత్వ కార్యాలయాల్లో ధూమపానం చేస్తే జరిమానా విధిస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు పీటర్ డేమియన్, నాగమల్లేశ్వరరావు, జొస్ఫిన్ రాణి, భవానీ కుమారి, రాజ్యలక్ష్మి, అన్నామణి, జ్యోతి, వెంకటరత్నం, నాగమణి, సౌజన్య, సుధ, పద్మ, శోభ, వెంకాయమ్మ, శాంతకుమారి పాల్గొన్నారు.

ప్రజాశక్తి - నాదెండ్ల : మండలంలోని గణపవరం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఆధ్వర్యంలో ర్యాలీ నిర్వహించారు. డాక్టర్ ప్రసాద్ నాయక్ మాట్లాడుతూ భారతదేశంలో వచ్చే కేన్సర్ వ్యాధులకు 40 శాతం పొగాకు నమలడం కారణమని చెప్పారు. పొగాకు నమలటం ద్వారా నోటి క్యాన్సర్, ఊపిరితిత్తులు, కాలియా కేన్సర్, గుండె సంబంధిత వ్యాధులు వస్తాయని వివరించారు. పురుషుల్లో పిల్లలు పుట్టుక ఇక పోవటం, మహిళల్లో గర్భాశయ కేన్సర్‌లు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య పర్యవేక్షకులు అజీజ్, పద్మావతి, ఎఎన్ఎంలు, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

దిగుబడి ఉన్నా ధర దక్కక

- నష్టాలు మూటగట్టుకున్న పసుపు రైతు
- ఇంకా ప్రారంభమవ్వని కొనుగోలు కేంద్రాలు
- రైతుల చేయిదాటి వ్యాపారులకు చేరిన పంట

ప్రజాశక్తి - పెదకూరపాడు

రైతులు ఎంతో ఆశగా చేపట్టిన పసుపు సాగు ఆ ఆశలను సగమే నెరవేర్చింది. దిగుబడి బాగానే వచ్చినా ధరలు మాత్రం దక్కడం లేదు. వాణిజ్య పంటలకు ప్రసిద్ధిగాంచిన పల్నాడు జిల్లాలో పత్తి, మిర్చితోపాటు గణనీయమైన స్థాయిలో పసుపు పంటా సాగవుతోంది. గతేడాది జిల్లా వ్యాప్తంగా 2203 ఎకరాల్లో పసుపు సాగవుతుండగా పెదకూరపాడు మండలంలో 313 ఎకరాల్లో సాగైంది. జిల్లా వ్యాప్తంగా సగటు దిగుబడి 22 క్వింటాళ్లుంటే పెదకూరపాడులో 35 క్వింటాళ్లుగా ఉంది.

పసుపు పంట సాగుకు ఎకరాకు పసుపు కొమ్ములు రూ.25 వేలు, కౌలు రూ.20 వేలు, అరకలు, ట్రాక్టర్లు రూ.25 వేలు, కలుపు రూ.10 వేలు, ఎరువులు రూ.10 వేలు, పై మందులు రూ.10 వేలు, కొమ్ము దున్నటం, ఏరటం, ఉడికించడం, ఆరపెట్టడం, పాలిష్ పెట్టటానికి రూ.50 వేలు ఇలా మొత్తం రూ.లక్షన్నర వరకూ ఖర్చవుతుంది. దీనికి రైతు శ్రమనూ కలిపితే మరో రూ.50 వేలు పెరుగుతుంది. ఈ డబ్బు మొత్తం రైతులు అప్పులు చేసి పెట్టుబడి పెట్టిందే. బ్యాంకుల నుండి రుణాల కోసం ఎదురు చూడ్డం మినహా ఏనాడూ వచ్చింది లేదు.



అయినా అన్ని కష్టాలకూ ఓర్చి పంట పండిస్తే తీరా రైతు చేతికి పంట వచ్చేనాటికి ధరలు పడిపోయాయి. సాగు సందర్భంలో రూ.7 వేలకు పైగానే ఉన్నా అనంతరం రూ.5000-5600కు మించి వ్యాపారులు ఇవ్వలేదు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.6850 కూడా రైతులకు దక్కలేదు. సాధారణంగా మండలంలోని రైతుల్లో ఎక్కువ మంది రవాణా ఛార్జీల భారం తట్టుకోలేక పంటను స్థానిక వ్యాపారులకే విక్రయిస్తుంటారు. తక్కువ మంది మాత్రమే దుగ్గిరాల మార్కెట్ యార్డుకు తీసుకెళ్తారు. అక్కడికి తీసుకెళ్లినా అక్కడా ధర లేకుంటే నిరీక్షణ తప్పదు. ఈ క్రమంలో ఆర్థికంగా వెసులుబాటున్న వారు పంటను ఏసీల్లో పెట్టుకుంటారు. అది లేనివారు వ్యాపారులకే తెగనమ్ముకుంటారు. దీంతో పంటలో గణనీయమైన భాగం వ్యాపారుల వద్దకు చేరగా ధర వస్తే అమ్ముకోవడానికి వారూ నిరీక్షిస్తున్నారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది మండలంలోని పసుపు రైతులు ఎక్కువ మంది ఎకరాకు రూ.20 వేల నుండి 70 వేల వరకూ నష్టపోయారు. జిల్లాలోని ఇతర ప్రాంతాల్లో ఇదింకా ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. రైతు భరోసా కేంద్రాల ద్వారా పంటను కొనుగోలు చేస్తామేని ప్రభుత్వం చెప్పినా అది ప్రకటనలకే పరిమితమైంది.



పసుపు కొమ్ములను పరిశీలిస్తున్న పెదకూరపాడు జోన్ ఉద్యాన శాఖాధికారి నిత్యశ్రీ

రూ.50 వేలు నష్టం..



మేకల అశోక్, కౌలురైతు, రామాపురం.

రెండెకరాలు కౌలుకు తీసుకుని పసుపు సాగు చేశాను. ఎకరాకు రూ.లక్షన్నర చొప్పున పెట్టుబడికి రూ.3 లక్షలు ఖర్చయింది. దిగుబడి బాగానే వచ్చింది. తీరా పంట అమ్మితే రూ.రెండున్నర లక్షలే వచ్చాయి.



వెంకటేశ్వర్లు, రైతు, తాళ్లూరు.


2.25 ఎకరాల్లో పసుపు వేశా. క్వింటాళ్ రూ.5 వేలు చొప్పున అమ్మాల్సి రావడంతో రూ.40 వేలు నష్టపోయా. ప్రభుత్వం మద్దతు ధరకు కొనుగోలు చేసినా నష్టాలు తప్పేవి.

అనుమతి వచ్చిన వెంటనే కొనుగోలు



బెన్నీ, పల్నాడు జిల్లా ఉద్యాన శాఖాధికారి.

ప్రభుత్వం నుంచి అనుమతి వచ్చిన వెంటనే పసుపు కొనుగోలుకు సిద్ధంగా ఉన్నాం. గతేడాది కూడా మార్క్‌ఫెడ్ సహకారంతో రైతు భరోసా కేంద్రాల ద్వారా కొనుగోలు చేశాం.



తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న కౌలు రైతు సంఘం నాయకులు

కౌల్దార్లకు గుర్తింపుకార్డుల కోసం ధర్నా

ప్రజాశక్తి - సత్తెనపల్లి రూరల్

భూ యజమానితో సంబంధం లేకుండా కౌలు రైతులకు గుర్తింపు కార్డులు మంజూరు చేయాలని, ఇందుకు వీలుగా పంటల సాగు హక్కుచట్టంలో మార్పులు చేయాలని కౌలురైతు సంఘం మండల కార్యదర్శి పి.మహేష్ డిమాండ్ చేశారు. కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వాలని కోరుతూ కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో తహశీల్దార్ కార్యాలయం వద్ద బుధవారం ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా మహేష్ మాట్లాడుతూ కౌలు రైతులకు పెట్టుబడి సాయం కింద రైతు భరోసాను రూ.25 వేలకు పెంచాలని, భూమిలేని ఓసీ కౌలు రైతులకు కూడా రైతు భరోసా ఇవ్వాలని కోరారు. కౌల్దార్లతోపాటు చిన్న సన్నకారు రైతులందరికీ రుణమాఫీ చేయాలని, అప్పుల బాధతో ఆత్మహత్య చేసుకున్న రైతు, కౌలు రైతు కుటుంబాలకు రూ.25 లక్షల పరిహారం ఇవ్వాలని ప్రభుత్వాన్ని కోరారు. ఈ అంశాలపై కౌలురైతు సంఘం ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా జాతాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. దీంతోపాటు 10వ తేదీన కృష్ణా జిల్లా తోట్లవల్లూరులో పాదయాత్ర ప్రారంభం అవుతుందని, 12వ తేదీన మంగళగిరిలోని సిసిసిఎల్ఎ కార్యాలయానికి చేరి అక్కడ ఆందోళన చేస్తారని చెప్పారు. కార్యక్రమాల్లో కౌల్దార్లంతా పాల్గొనాలని పిలుపునిచ్చారు. అనంతరం తహశీల్దార్ కె.నగేష్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కౌలురైతు సంఘం రాష్ట్ర నాయకులు డి.మేరమ్మ, మండల అధ్యక్షులు సిహెచ్ లక్ష్మీనారాయణ, రైతుసంఘం మండల అధ్యక్ష కార్యదర్శులు బి.వెంకటేశ్వర్లు, ఎం.నరసింహారావు, ఆర్.పూర్ణచంద్రరావు, బి.రామారావు, షేక్ హుస్సేన్నా, అనూష, సుజాత, వెంకయ్య, వెంకటనారాయణ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏపూరి గోపాలరావు

ప్రజలకోసం వెంకటపతి అలుపెరగని పోరాటం

ప్రజాశక్తి - క్రోసూరు : రైతులు, పీడిత ప్రజల కోసం పుతుంబాక వెంకటపతి అలుపెరగని పోరాటం చేశారని సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు ఏపూరి గోపాలరావు అన్నారు. వెంకటపతి 30వ వర్ధంతి సభ ఊటుకూరులో జి.మధుసూదనరావు అధ్యక్షతన బుధవారం నిర్వహించారు. గోపాలరావు మాట్లాడుతూ నాగార్జునసాగర్ ప్రాజెక్టును నిర్మించాలని సత్తెనపల్లిలో 50 వేల మంది రైతులను సమీకరించి సాగర్ ప్రాజెక్టును సాధించారని చెప్పారు. సాగర్ ప్రాజెక్టు కాల్వల్లో ఎక్కడ ఏ సమస్య వచ్చినా అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేవారని, భోధనం ప్రాంతంలో పేదలకు భూములు పంచాలని, చెరువు, బంజరు భూములు సాగు చేసుకుంటున్న పేదలకు భూములు పంచాలని అనేక ఉద్యమాలు చేసి సాధించారని గుర్తు చేశారు. సిపిఎం పల్నాడు జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జి.రవిబాబు మాట్లాడుతూ ఊటుకూరు సర్పంచ్‌గా, ఫిరంగిపురం సమితి ప్రసిడెంట్‌గా, సత్తెనపల్లి ఎమ్మెల్యేగా ప్రజలకు నిస్వార్థంగా సేవలందించిన అసలైన ప్రజానాయకుడని చెప్పారు. ఆయన ప్రజాప్రతినిధిగా పనిచేసిన కాలంలో అనేక స్కూళ్లను ఏర్పాటు చేయించారన్నారు. అయితే ఈ విలువలకు నేటి పాలక పార్టీలు తీలోదకాలిచ్చాయని, ఈ నేపథ్యంలో ప్రజా సమస్యలపై సిపిఎం చేస్తున్న పోరాటాల్లో అందరూ భాగస్వామ్యం కావాలన్నారు. తొలుత వెంకటపతి చిత్రపటానికి సీనియర్ నాయకులు ఎ.ఆంజనేయులు పూలమాలలేశారు. సిహెచ్.యేసయ్య ఆర్.వెంకటేశ్వర్లు, చిన్నప్ప, జి.మహేష్, మోహనరావు, జి.నాగరాజు, జి.అబ్రహాం, షేక్ సుభాని, జి.ఎలిశమ్మ పాల్గొన్నారు.

అధికారుల ఇష్టారాజ్యంగా తెనాలి ఆర్టీసీ డిపో

ప్రజాశక్తి-తెనాలి:

ప్రజారవాణాకు పెద్ద దిక్కుగా ఉన్న ఆర్టీసి గ్రహణం పట్టింది. కనీస అవగాహన, అధ్యయనం లేకుండా, ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా ఆర్టీసికి ఆదరణ ఉన్న మార్గాల్లోనూ సర్వీసులు పూర్తిగా నిలిపివేయటం, డిమాండ్‌కు ఏమాత్రం పొంతన లేకుండా నామమాత్రంగా బస్సులు నడపటం, అధికారుల ఇష్టారాజ్యానికి నిదర్శనంగా ఉంది. అద్దె ప్రాతి పదికన నడిచే సర్వీసుల అద్దె ఒప్పందం ముగిస్తే, ఏకంగా ఆ సర్వీసునే రద్దు చేస్తున్నారు. అధికారులే పరోక్షంగా ప్రైవేటు వాహనాలను ప్రోత్సహిస్తున్నారని ప్రయాణీకులు ఆరోపిస్తు న్నారు. లాభాల బాటలో ఉన్నామని చెబుతున్న తెనాలి ఆర్టీసి డిపోలో గతంలో ఎన్నడూ లేని విధంగా వ్యవహరిస్తున్న అధికారుల తీరుకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి.

- తెనాలి- గుంటూరు నాన్‌స్టాప్‌లు రద్దు
- తెనాలి- నందివెలుగు - గుంటూరుకు గతంలో 8 బస్సులు
- తాజాగా రెండు బస్సులకు కుదింపు
- ఆటోల్లో అధిక ఛార్జీలతో ప్రజల ఇక్కట్లు



తెనాలి బస్టాండ్

తెనాలిడిపో పరిధిలో మొత్తం 85 బస్సులున్నాయి. వీటిలో 25 అద్దె బస్సులు కాగా, 60 బస్సులు ఆర్టీసీవే. ప్రజల అవసరాలను, డిపో ఆదాయాన్ని దృష్టిలో పెట్టుకుని సర్వీసులు పెంచటం, డిమాండ్ లేని రూట్లలో బస్సులు తగ్గించటం సాధారణంగా జరుగుతుంది. అయితే తెనాలి డిపో అధికారులు మాత్రం ఇందుకు భిన్నంగా వ్యవహరిస్తున్నారు. తెనాలి డిపో నుంచి గుంటూరుకు ప్రతి 15 నిముషాలకు నాన్‌స్టాప్ సర్వీసు అందుబాటులో ఉండేది. ఆ సర్వీసులకు విశేష ప్రజాదరణ ఉండేది. అయితే ఏకంగా నాన్‌స్టాప్ సర్వీసులను రద్దు చేసేశారు. తెనాలి-గుంటూరు వయా నారాకోడూరు మీదుగా అన్నీ ఆర్డినరీ సర్వీసులే. తెనాలి నుంచి గుంటూరు, అక్కడి నుంచి వివిధ ప్రాంతాలకు నిత్యం ప్రయాణించే ఉద్యోగులు, వ్యాపారులు, విద్యార్థులు అనేక మంది ఉన్నారు. వారందరికీ నాన్‌స్టాప్ సర్వీసులు ఎంతో ఉపయోగకరం. కనీసం ప్రజాభిప్రాయ సేకరణ కూడా లేకుండా నాన్‌స్టాప్ సర్వీసులను పూర్తిగా నిలిపివేశారు. దీంతో ఆర్డినరీ సర్వీసుల్లో ప్రయాణం తీవ్ర జాప్యానికి కారణమౌతోందని ప్రజలు వాపోతున్నారు. తెనాలి నుంచి గుంటూరుకు డబుల్‌రోడ్డు ఉన్నా, ఓవర్ టేక్ చేసే అవకాశం లేక దాదపుగా నాన్‌స్టాప్, ఆర్డినరీ రెండూ ఒకే సమయంలో చేరుతున్నాయని, దీంతో నాన్‌స్టాప్‌లకు ఆదరణ తగ్గినట్లు అధికారులు పొంతనలేని సమాదానాలు చెబుతున్నారు.

అయితే నాన్‌స్టాప్ సర్వీసులను పునరుద్దరించాలని ఇటీవల పట్టణ పరిసర ప్రాంత అభివృద్ధి సంఘం డిపో మేనేజర్‌కు వినితిపత్రం సమర్పించారు. అయినా ఎలాంటి స్పందనలేదు. అలాగే తెనాలి-గుంటూరు వయా నందివెలుగు మార్గంలో గతంలో 8 బస్సులు ఉండేవి. ప్రస్తుతం కేవలం రెండు బస్సులు మాత్రమే నడుపుతున్నారు. ఈ మార్గంలో తక్కెళ్ళపాడు, ఉప్పలపాడు, హాఫ్‌పేట, కొలకలూరు, నందివెలుగు గ్రామాల నుంచి అధిక సంఖ్యలో ప్రయాణీకులుంటారు. ముఖ్యంగా నిత్యం ప్రయాణించే విద్యార్థులున్నారు. ఎంతో ఆదాయ వనరుగా ఉన్న మార్గంలో ఆర్టీసీ అధికారులు బస్సు సర్వీసులను తగ్గించటం కేవలం ప్రైవేటు ఆపరేటర్లు అంటే ఆటోలను ప్రోత్సహించేందుకేనన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఫలితంగా గుంటూరు నుంచి నందివెలుగుకు ప్రజలు ఆటోల్లో ప్రయాణిస్తున్నారు. ఆటోలో కనీసం పది మంది లేనిదే కదలని పరిస్థితి. బస్సులు లేవన్న కారణంగా ఆటోల చార్జీలు కూడా ప్రయాణీకులకు భారంగానే ఉన్నాయి.

అద్దె బస్సుల విషయంలోనూ అధికారులు నిర్లక్ష్యంగానే వ్యవహరిస్తున్నారు. తెనాలి నుంచి తిరుపతికి ఉదయం ఆరుగంటలకు దీర్ఘకాలంగా ఉన్న సర్వీసును దాదాపు రెండు నెలలుగా నిలిపివేశారు. కారణమేమంటే ఆ బస్సు అద్దె కాలం ముగిసిందని, ఫలితంగా సర్వీసును నిలిపివేశామని అధికారులు చెబుతున్నారు. పైగా 400 కిలోమీటర్లు ప్రజలు ప్రయాణం చేయలేకపోతున్నారని, రైళ్ల అందుబాటులోకి వచ్చాయని కొత్తగా చెబుతున్నారు. ఇంకా మరికొన్ని మార్గాల్లోనూ ఇదే పరిస్థితి నెలకొంది.

వాస్తవానికి తెనాలి నుంచి తిరుపతికి వెళ్లే బస్సు గుంటూరు వరకూ నాన్‌స్టాప్‌గానూ ఉపయోగపడుతుంది. అలాగే గుంటూరు నుంచి ప్రయాణీకుల తాకిడి ఉంటుంది. కేవలం అద్దె కాలం ముగిసిన తరువాత కొనసాగించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు ప్రయాణీకుల నుంచి ఉన్నాయి. తిరుపతి బస్సుకు తెనాలి నుంచి చిలకలూరిపేట, మార్టూరు, ఒంగోలు వరకూ నిత్యం ప్రయాణించే ఉద్యోగులున్నారని, కనీసం ఆస్థానంలో ఒంగోలు వరకైనా సర్వీస్ నడపాలని వారు కోరుతున్నారు.

నాన్‌స్టాప్‌లు నిలిపివేశాం..మార్పులు వాస్తవమే

రాజశేఖర్, డిపో మేనేజర్, తెనాలి



తెనాలి-గుంటూరు నాన్‌స్టాప్‌లను నిలిపివేశాం. ఎందుకంటే ఆర్డీనరీకి, నాన్‌స్టాప్‌కు ప్రయాణ సమయంలో ఐదు నిమిషాలకు మినహా వ్యత్యాసం లేదు. ఎందుకంటే బస్సులు ఓవర్‌టేక్ చేసే పరిస్థితి లేదు. పైగా నాన్‌స్టాప్‌కు చార్జీ రూ.50 ఉంటే పల్లెవెలుగుకు రూ.30 మాత్రమే. నందివెలుగు మీదుగా గుంటూరుకు గతంలో ఎనిమిది సర్వీసులున్నాయి. ఈ మద్య ఈ మార్గంలో ఆర్టీసికి ఆదరణ తగ్గింది. అందుకే సర్వీసులు తగ్గించాం. తెనాలి-తిరుపతి సర్వీసు నిలిపివేశాం. ఎందుకంటే అద్దె గడువు ముగిసింది. పైగా తిరుపతి దూరం కావటంతో బస్సుకు ప్రజల నుంచి ఆదరణలేదు. అయినా మరోసారి ఆయా మార్గాలను పరిశీలించి, అవసరాన్ని బట్టి సర్వీసులు పునరుద్దరణకు చర్యలు తీసుకుంటాం.

వేమారెడ్డితో ఎంపి భేటీ

ప్రజాశక్తి-తాడేపల్లి



ఎంటిఎంసి వైసిపి అధ్యక్షులు దొంతిరెడ్డి వేమారెడ్డితో రాజ్యసభ ఎంపి ఆళ్ల ఆయోధ్యరామిరెడ్డి బుధవారం తాడేపల్లి బైపాస్‌రోడ్డు లోని ఆయన కార్యాలయంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా వేమారెడ్డిని అభినందించి శాలువాతో సత్కరించారు. రాజకీయాలపై ఇరువురు చర్చించారు. మంగళగిరిలో వైసిపి గెలుపునకు కృషి చేయాలన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న మాజీమంత్రి ఆలపాటి

పంట నష్టపోయిన రైతుకు పరిహారమేది?

మాజీ మంత్రి ఆలపాటి

అసాంఘిక కార్యకలాపాలకు అడ్డాగా తెనాలి అని విమర్శ

ప్రజాశక్తి-తెనాలి

రైతులు, ప్రజా సంక్షేమాన్ని ప్రభుత్వం గాలికొదిలేసిందని, అసాంఘిక కార్యకలాపాలకు తెనాలి అడ్డంగా మారిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమెత్తారు. స్థానిక కొత్తపేటలోని పార్టీ కార్యాలయంలో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల కురిసిన భారీ వర్షాలకు రైతులు తీవ్రంగా నష్టపోయారన్నారు. సాక్షాత్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ పంటనష్టం అంచనా వేయాలని అధికారులను ఆదేశించారని, అయితే ఇప్పటి వరకూ అధికారులు పంట నష్టం అంచనాలను బహిర్గతం చేయలేదన్నారు. తడిసిన, రంగు మారిన ధాన్యం, జొన్న, మొక్కజొన్న కొనుగోలు చేస్తామని ప్రకటించిన ప్రభుత్వం ఏమాత్రం చర్యలు తీసుకోలేదన్నారు. ఏదో కొద్దో గొప్పో కొనుగోళ్ళు జరిగితే దానిలో అధికార పార్టీ నాయకులు కమిషన్లకు కక్కుర్తి పడ్డారని ఆరోపించారు. మరో వైపు అసాంఘిక శక్తులకు అడ్డాగా తెనాలి మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. తెనాలి పరిసర ప్రాంతాల్లో గంజాయి విక్రయాలు రోజురోజుకూ పెరిగిపోతున్నాయని, మరో వైపు అధికార పార్టీ ముసుగులో లాటరీ టిక్కెట్ల విక్రయం పేరున పేదలను దోచేస్తున్నారన్నారు. పేదల నివేశన స్థలాలకు భూ సేకరణలో కోట్లాది రూపాయల కుంభకోణానికి పాల్పడ్డారని, అలాగే ఇసుక, మద్యం, మట్టి కుంభకోణాలలో వైసిపి గణనీయమైన ప్రగతి సాధించిందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం రైతులను మోసగించటం మానుకోవాలని, దోపిడీ విదానాలకు స్వస్థి పలకాలన్నారు. లేని పక్షంలో ప్రజల చేతిలో గుణపాఠం తప్పదన్నారు. సమావేశంలో నాయకులు టి.హరిప్రసాద్, పెండేల వెంకట్రావ్, మహ్మద్ ఖుద్దూస్, జె.మహేష్, గిరి గణేష్, గుదిబండి గోవర్ధనరెడ్డి, కె.శ్రీనివాసరావు పాల్గొన్నారు.



అధికారులతో మాట్లాడుతున్న మేయర్

సిఎం పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

నగర మేయర్ కావటి శివనాగమనోహర్ నాయుడు

ప్రజాశక్తి-గుంటూరు

ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహనరెడ్డి 2వ తేదీన గుంటూరు పర్యటనను విజయవంతం చేయాలని నగర మేయర్ కావటి శివనాగ మనోహర్‌నాయుడు తెలిపారు. స్థానిక చుట్టగుంట వద్ద వైఎస్సార్ యంత్ర సేవా పథకం రెండో విడతలో భాగంగా రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ ఉపకరణాలు పంపిణీ చేయటానికి సి.యం గుంటూరు వస్తున్నందున, సదరు పర్యటనకు సంబంధించిన ఏర్పాట్లపై మేయర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి తీసుకోవాల్సిన చర్యల పై తగు ఆదేశాలు జారీచేశారు. మేయర్ మాట్లాడుతూ, చుట్టగుంట ప్రాంతంలో సిఎం రైతులకు ట్రాక్టర్లు, వ్యవసాయ పరికరాలను పంపిణీ చేస్తారని, అందుకు తగిన విధంగా సభావేదిక ఏర్పాటు జరుగుతుందన్నారు. సభావేదిక పరిసర ప్రాంతాల్లో, పెరేడ్ గ్రౌండ్ నుండి చుట్టగుంట జంక్షన్ వరకు ప్రత్యేక పారిశుధ్య పనులు చేపట్టాలని, డివైడర్ల పక్కన మట్టి కుప్పలు తొలగించాలని ప్రజారోగ్య అధికారులను ఆదేశించారు. పారిశుధ్య పనులను డిప్యూటీ కమిషనర్ల ఆధ్వర్యంలో ప్రత్యేకంగా శానిటరీ ఇన్స్పెక్టర్లు, కార్యదర్శులకు భాధ్యతలు కేటాయించాలన్నారు. డివైడర్లు శుభ్రంగా ఉంచాలన్నారు. రోడ్ల పక్కన ఆక్రమణలు, సభావేదికకు అడ్డుగా ఉండే వాటిని తొలగించాలని పట్టణ ప్రణాళిక అధికారులను ఆదేశించారు. సిఎం పర్యటన మార్గంలో రోడ్లపై పాట్ హెూల్స్ ఉంటే వాటికి యుద్ధప్రాతిపదికన మరమ్మతులు చేయాలని, సభకు హాజరయ్యే రైతులకు త్రాగునీరు, మజ్జిగ అందించడానికి చర్యలు తీసుకోవాలని ఇంజినీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కమిషనర్ పెద్ది రోజా, డిప్యూటీ కమిషనర్లు బి.శ్రీనివాసరావు, శ్రీనివాసరావు, టి.వెంకటకష్ణయ్య, యస్.ఈ భాస్కర్, సిటీ ప్లానర్ ప్రదీప్‌కుమార్, డి.సి.పిలు కోటయ్య, మూర్తి, ఈ.ఈలు సుందర రామిరెడ్డి, కొండారెడ్డి, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు

వైసిపి వెన్నులో దడ పెరిగింది : కన్నా

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి




మీడియా సమావేశంలో కన్నా లక్ష్మీనారాయణ

మహానాడుసభకు వచ్చిన ప్రజలను చూసి వైసిపిలో వణుకు ప్రారంభం అయిందని మాజీ మంత్రి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. బుధవారం తన నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వైసిపి పాలనలో అభివృద్ధి లేదన్నారు. గత నాలుగేళ్లలో అభివృద్ధి పథకాలకు సంబంధించి ఇచ్చిన హామీలు ఒక్కటి అమలు కాలేదన్నారు.అమరావతిని నిర్వీర్యం చేశారని గత నాలుగేళ్లలో రాజధానిలో ఎటువంటి అభివృద్ధి చేయలేదన్నారు. లోపాలు ఎత్తిచూపిన ప్రతిపక్ష పార్టీల నాయకులను మంత్రులు, ఎమ్మెల్యేల చేత బూతులు తిట్టించడం తప్ప సిఎంజగన్ సాధించింది ఏమీ లేదన్నారు. టిడిపి హయంలోనే సామాజిక న్యాయం జరిగిందన్నారు. చంద్రబాబు ఇచ్చిన హామీలను అమలు చేస్తారని గతంలో చేశారని తెలిపారు. ఈసారి మేనిఫెస్టోలో మహిళలకు, యువతకు, రైతులకు,బిసిలకు అధిక ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. సంపద సష్టించి ఆదాయం పెంచి సంక్షేమ కార్యక్రమాలు అందిస్తామన్నారు. సిపిఎస్ రద్దు, సంపూర్ణ మద్యపాన నిషేధం, ఢిల్లీని తలదన్నే రాజధాని నిర్మాణం, పోలవరం, ప్రత్యేక హోదా, ధరలు స్థిరీకరణ నిధి, జాబ్ క్యాలెండర్, గిట్టుబాటు ధర కల్పిస్తామంటూ చేసిన వైసిపి ఇచ్చిన హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. 50 శాతం హామీలు అమలు చేయకుండా 98 శాతం అమలు చేసామని చెప్పుకోవడం సిగ్గుచేటన్నారు. బూతులు తిట్టడానికి ఎమ్మెల్యే, మంత్రి పదవులు ఎందుకని తెలిపారు. రైల్వే స్టేషన్లు, బస్టాండ్‌లలో జేబులుకొట్టేవారు కూడా బూతులు మాట్లాడతారని వీరిలాగా వైసిపి ప్రజా ప్రతినిధులు, మంత్రులు తయారయ్యారని తెలిపారు. బూతులు తిట్టేవారిని మేము తయారు చేయగలం అన్నారు. వైసిపి వారిలాగా అసభ్యకరంగా మాట్లాడటం తమకు వచ్చని కానీ తమకు సంస్కారం అడ్డువస్తుందన్నారు. పరిపాలన చేతగాక పోతే పారిపోవాలన్నారు. మీడియా సమావేశంలో టిడిపి నాయకులు అడపా నాగేంద్రం, తాళ్ల వెంకటేష్ యాదవ్ పాల్గొన్నారు.

సత్తెనపల్లి టిడిపి ఇన్‌ఛార్జిగా కన్నా

ప్రజాశక్తి -సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియో జకవర్గం టిడిపి ఇన్‌ఛార్జిగా మాజీ మంత్రి కన్నా లక్ష్మినారాయణ ను నియమితులయ్యారు. ఈమేరకు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అచ్చెన్నాయుడు బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కన్నా లక్ష్మినారాయణ నియా మకంపై టిడిపి నేతలు హర్షం వ్యక్తంచేశారు. గత నాలుగు సంవత్సరాలుగా ఇన్‌ఛార్జి లేకపోవటంతో టికెట్ ఆశిస్తున్న వారు గ్రూపులుగా విడిపోయి ఎవరికి వారు పార్టీ కార్యక్రమాలు నిర్వహించారు. సత్తెనపల్లి ఇన్‌ఛార్జి పదవి కోసం మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు టిడిపి నేతలు కోడెల శివరాం, తెలుగు యువత నాయకులు మన్నెం శివనాగమల్లేశరరావు, నాగోతు శౌరయ్యలు ఆశించారు. కన్నాకు అవకాశం ఇవ్వడంతో నలుగురు నేతలు నిరాశకు గురయ్యారు. పార్టీ అధికారంలోకి వస్తే సముచిత స్థానం కల్పిస్తామని అధినేత చంద్రబాబు నాయకులకు హామీ ఇచ్చారని సమాచారం. టికెట్ ఆశించి భంగపడ్డ నాయకులు కన్నాకు ఏమేరకు సహకరిస్తారో వేచిచూడాలి.



ఐనవోలులో పట్టాలు పంపిణీ చేస్తున్న కత్తెర సురేష్ కుమార్

ఐనవోలులో పట్టాలు పంపిణీ

ప్రజాశక్తి - తుళ్లూరు

రాజధాని గ్రామం ఐనవోలులో సెంటు స్థలం కు సంబంధించిన పట్టాలను తాడికొండ నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త కత్తెర సురేష్ కుమార్ బుధవారం పంపిణీ చేశారు.ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి చెప్పినమాట ప్రకారం తమకు కేటాయించిన ప్లాట్ వద్దనే లబ్దిదారులకు పట్టాలు అందజేయడం జరిగిందని సురేష్ కుమార్ చెప్పారు. కార్యక్రమంలో ఆర్డీవో ప్రభాకరరెడ్డి, తహశీల్దార్ ఫణీంద్ర బాబు, వైసిపి నాయకులు మాదల మహేంద్ర,బెజ్జం రాంబాబు, శంగారపాటి సందీప్, ఆలోకం సురేష్, తుమ్మూరు వరప్రసాద్ రెడ్డి,రమణారెడ్డి,బండి స్టాలిన్,సిహెచ్ సురేష్, కె వినోద్, కొప్పుల శేషగిరిరావు, రెవెన్యూ సిబ్బంది, వాలంటీర్లు పాల్గొన్నారు.

బెల్టుషా'ఫుల్'..

- అమరావతి మండలంలోని పలు గ్రామాల్లో విచ్చలవిడిగా విక్రయాలు
- నిషేధిత పొగాకు ఉత్పత్తులు గుట్కా, పాన్ పరాగ్, ఖైనీలను కూడా
- నిత్యావసరాల మాటున ఉంచి ద్విచక్రవాహనాలపై రవాణ

ప్రజాశక్తి - అమరావతి

మండలంలోని పలు గ్రామాల్లో బెల్టు షాపులతో పాటు నిషేధిత పొగాకు ఉత్పత్తుల అమ్మకాలు జోరుగా సాగు తున్నాయి. నిషేధిత గుట్కా, పాన్ పరాగ్, ఖైనీల అదనంగా డబ్బు తీసుకుని విక్రయిస్తున్నారు. విచ్చలవిడిగా సాగుతున్న ఈ వ్యాపారం అధికారులు కనుసనల్లోనే జరుగుతోందని ఆరోపణలు లేకపోలేదు. గ్రామాల్లోని బడ్డీ బంకులు, కూల్ డ్రింక్ షాపులు, కిరాణా షాపులు, హోటళ్లు, టీ స్టాల్స్, కిళ్ళీ షాపుల్లో గుట్కా ఖైనీలకు అదనంగా డబ్బులు తీసుకుని విక్రయిస్తున్నారు. అనధికారిక మద్యం విషయానికొస్తే 'మూడు ఫుల్‌లు, ఆరు క్వార్టర్లు' అన్న చందాన అమ్మకాలు సాగుతున్నాయి. నియోజకవర్గ పరిధిలో నియంత్రించాల్సిన ఎస్ఇబి పోలీసుల దాడులు, మద్యం డిపో నుంచే వచ్చే అధి కారుల తనిఖీలు లేకపోవడంతో నిషేధిత ఉత్పత్తులను, అనధికారిక మద్యాన్ని విక్ర యించే వ్యాపారస్తులదే ఇష్టరాజ్యమైంది. వ్యాపారులు గుట్టు చప్పుడు కాకుండా ఇతర మండలాలు, జిల్లాల నుంచి దిగుమతి చేసుకొని అమ్మ కాలు చేస్తున్నారు. నిషేధిత ఉత్పత్తుల అమ్మకాల ద్వారా వ్యాపారులు కొను గోలు దారుల లక్షల రూపాయలు దండు కుంటున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని గ్రామ పంచాయతీల్లో చిన్న చిన్న బండ్లపై ఉన్న బంకుల్లో నిషేధిత ఉత్పత్తుల అమ్మకాలు దొంగ చాటుగా జరుగుతున్నట్లు సమాచారం. ఈ ఉత్పత్తులను విక్రయించే వారు జిల్లా నలుమూల నుంచి వాటిని కొనుగోలు చేస్తు న్నారు. ఇంత జరుగుతున్నా పోలీసులు, అధికారులు మాత్రం




అమరావతిలోని ప్రభుత్వ మద్యం దుకాణం నుంచి అదనంగా డబ్బు చెల్లించి ద్విచక్ర వాహనంపై సరుకు తీసుకెళ్తున్న చిత్రం




కన్నెత్తి చూడటం లేదు. వీటి విక్రయాలను అడ్డు కోవాల్సిన వారే పట్టించుకోకపోవడంతో వ్యాపారులు మరీ రెచ్చిపోతున్నారు. మూడు రోజుల క్రితం అమరావతి మండలంలోని దిడుగులోని ప్రభుత్వ వైన్ షాపు నుంచి అదనంగా డబ్బులు చెల్లించిన ఒక మహిళ 20 క్వార్టర్స్ బాటిల్స్ తీసుకు వెళ్తున్న సమయంలో ఎస్ఇబి సిబ్బంది కి సమాచారం అందడంతో అక్కడికి వెళ్లిన వారు ఆమెను పట్టుకున్నట్లు తెలుస్తోంది. అయితే, ఆ సిబ్బందికి సుమారు రూ.20, 000 వరకు ముట్టజెప్పి బయటపడ్డట్టు విశ్వసనీయ సమాచారం. చాటు మాటుగా కొన్ని దుకాణాల వారు. మరికొన్ని చోట్ల బహిరంగంగా వీటిని విక్రయిస్తున్నారు. పెదకూరపాడు నియోజకవర్గంలోని 5 మండలాల్లో ఉన్న బడ్డీ, బంకులే గుట్కా లు పాన్ పరాగ్, ఖైనీలకు, అధికారిక మద్యం విక్రయ కేంద్రాలుగా మారాయి. పెద్ద వ్యాపా రులు ఆయా గ్రామాల్లో నమ్మకంగా ఉన్న వారి ఇళ్లల్లో నిషేధిత పొగాకు ఉత్ప త్తులను, మద్యం బాటిల్స్‌ను విక్రయిస్తున్నారు. నిత్యావ సరసరుకుల మాటున, కాలేజీ బ్యాగుల్లో, ద్విచక్ర వాహనాలపై ఇలా వాటి రవాణాకు మార్గాలు ఎంచుకుంటున్నారు. నిషేధిత ఉత్పత్తులను విక్రయిస్తున్న వ్యాపారులపై పోలీసులు చర్యలు తీసు కోవాలని ప్రజలు కోరుతున్నారు.



ఓ బెల్టుషాపు వద్ద ..



మాట్లాడుతున్న పంచాయతిరాజ్ కమిషనర్ సూర్యకుమారి

సచివాలయం సిబ్బందితో సమీక్ష

ప్రజాశక్తి - యడ్లపాడు

మండలంలోని లింగారావుపాలెం సచివాలయం, రైతు భరోసా కేంద్రం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పనితీరును పంచాయతీ రాజ్ కమిషనర్ సూర్య కుమారి పరిశీలించారు. సచివాలయంలోని అన్ని శాఖల సిబ్బందితో బుధవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా పరిషత్ సిఇఒ మోహనరావు, మండల స్పెషల్ ఆఫీసర్, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.



ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టమైన విద్యాబోధన

ప్రజాశక్తి-పెదకూరపాడు

ప్రభుత్వ పాఠశాలల్లో పటిష్టమైన విద్యాబోధన జరుగుతుందని పెదకూరపాడుమండలంలోని తాళ్లూరు హైస్కూల్ పిసి చైర్మన్ గుత్తికొండ శ్రీనివాసరెడ్డి అన్నారు. బుధవారం కాసిపాడులో ఉపాధ్యాయ బృందంతో కలిసి బడిబాట కార్యక్రమంలో పాల్గొన్నారు. ఇంటిం టికీ తిరిగి పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్చమని ప్రచారం నిర్వ హించారు. పాఠశాలలో విద్యార్థులకు ఆరోగ్యకరమైన వస తులు ఉన్నట్లు వివరించి చెప్పారు. ఉపాధ్యాయులు పద్మజ, సాంబశివ రావులు మాట్లాడుతూ విద్యార్థులకు సిబిఎస్‌సి సిలబస్ తోపాటు అటల్ ల్యాబ్, డిజిటల్ క్లాస్, స్మార్ట్ టివి, బైజుస్ యాప్, ఐఐటి, ఎన్ఎంఎంఎస్‌లో విద్యాబోధన జరుగు తుందని, మానసికోల్లాసానికి, శరీర దారుఢ్యానికి యోగ, స్పోర్ట్స్, ఎన్‌సిసిలో శిక్షణ ఉంద న్నారు. జగనన్న విద్యా కానుక ద్వారా ఉచితంగా బ్యాగ్, బుక్స్, షూస్, యూనిఫాం, 'అమ్మ ఒడి', 'గోరుముద్ద' పథకాలు అందిస్తున్నామన్నారు. ప్రచార కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్‌రెడ్డి, సుబ్బారావు, అనురాధ పాల్గొన్నారు.



బాధితులతో కలిసి ఆర్డీఓ కు వినతిపత్రం ఇస్తున్న అరవిందబాబు

ఇళ్లు కూలిన బాధితులను ఆదుకోండి

ప్రజాశక్తి - నరసరావుపేట

ఈదురు గాలులకు ఇళ్ళు కూలిపోయి రోడ్డున పడిన కుటుంబాన్ని ఆదుకోవాలని టిడిపి నియోజకవర్గ భాద్యులు డాక్టర్ చదలవాడ అరవిందబాబు డిమాండ్ చేశారు. రొంపిచర్ల మండలం అలవాల గ్రామ ఎస్సీ కాలనీలో మంగళవారం గాలి వాన విధ్వంసం సృష్టించింది.గాలి వానతో రేకుల ధ్వంసమై రోడ్డున పడిన బాధిత కుటుంబంతో కలిసి నరసరావుపేట నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి డాక్టర్ చదలవాడ అరవిందబాబు ఆర్టీఓ ఎం. శేషిరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేశారు.గాలివాన విధ్వంసంతో పేద కుటుంబం వసతిని కోల్పోయారని ప్రభుత్వం గాలివాన బాదిత కుటుంబాన్ని ఆదుకోవాలని కోరారు.

పేదలకు మెరుగైన వైద్య సేవలందించండి

ప్రజాశక్తి-నరసరావుపేట

ఆరోగ్య శ్రీ పథకం ద్వారా వైద్యం చేయించుకునే పేదలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని జిల్లా కలెక్టర్ ఎల్.శివ శంకర్ ఆదేశించారు.ప్రభుత్వ, ప్రయివేటు హాస్పి టల్‌లలో ఆరోగ్య శ్రీ వైద్య సేవలు పొందే రోగులవిషయంలో వైద్యులు అంకిత భావంతో వైద్య సేవలందించాలని అన్నారు. డాక్టర్ వైఎస్ఆర్ 'ఆరోగ్య శ్రీ' పల్నాడు జిల్లా డిసిప్లినరీ కమిటీ సమావేశం బుధవారం జిల్లా కలెక్టర్ ఛాంబర్ లో జరిగింది. 58 ఫిర్యాదులను కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో జిల్లా కలెక్టర్ విచారణ జరపారు. వాటిలో 5 ఏ.ఎన్.ఎం మొబైల్ యాప్ ఫిర్యాదులు, 3 ఆడిట్ వింగ్ ఫిర్యాదులు, 104 ఐ.వి.ఆర్.ఎస్ ఔట్ బౌండ్ కాల్స్ ద్వారా నమోదైన 50 ఫిర్యాదులను కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరిపి పరిష్కరించారు. ఆరోగ్య శ్రీ పేషంట్లకు బిల్లులు లేకుండా నగదు రహిత వైద్యం అందించేలా ఆసుపత్రి యాజమాన్యం తగు చర్యలు తీసుకోవాలని, నిర్లక్ష్యం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ హెచ్చరించారు. సమావేశంలో ఏరియా హాస్పిటల్ సూపరింటెండెంట్ డాక్టర్ బివి. రంగారావు, రోటరీ క్లబ్ సెక్రటరీ అచ్యుత్, పల్నాడు జిల్లా ఆరోగ్య శ్రీ కోఆర్డినేటర్ పి.సునీల పాల్గొన్నారు.



వైద్య సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ ఎల్. శివశంకర్

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయం

ప్రజాశక్తి-కారెంపూడి

పేదరిక నిర్మూలనే ప్రభుత్వ ధ్యేయమని ప్రభుత్వ విప్ మాచర్ల ఎమ్మెల్యే,పిన్నెల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. కారెంపూడిలో ఆరవ రోజు గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని బుధవారం రాత్రి నిర్వహించారు. ప్రతి కుటుంబ సభ్యులను పలకరిస్తూ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విని తక్షణమే పరిష్కరించాలని అధికారు లను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిపి ఎం. శారద శ్రీనివాసరెడ్డి,జడ్పిటిసి షేక్ షఫీ తదితరులు పాల్గొన్నారు.



కారెంపూడిలో ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి

దమ్మాలపాడులో ఆలయ ప్రతిష్ట

ప్రజాశక్తి-ముప్పాళ్ల: మండలంలోని దమ్మాలపాడు లోని గంగా పార్వ తీ సమేత శంభు లింగేశ్వర స్వామి ఆలయ ప్రతిష్ట మహోత్సవం బుధవారం. ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రతిష్ట మహోత్సవానికి జలవ నరుల శాఖ మంత్రి అంబటి రాంబాబు, మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి, జనసేన నియోజక వర్గ నాయకులు బొర్రా వెంక టప్పారావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆలయ అభివృద్ధి కోసం జనసేన నాయకులు వెంకటప్పారావు రూ.50 వేల చెక్కును ఆలయ ధర్మకర్త శిరిగిరి వెంకట్రావుకు అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలు ఆలయ నిర్వాహకులు అన్నదానం కార్యక్రమం నిర్వహించారు.



దుర్గి గ్రంథాలయాధికారిగా వేణు గోపి

ప్రజాశక్తి-దుర్గి



మండల కేంద్రమైన దుర్గి గ్రంథాలయాధికారిగా పులిబండ్ల వేణు గోపి బుధవారం నూతనంగా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇటీవల ప్రభుత్వ బదిలీలలో భాగంగా వేణుగోపి కారంపూడి మండలం నుండి దుర్గి మండలానికి బదిలీ అయ్యారు. ప్రస్తుతం ఇక్కడ పనిచేస్తున్న మాచర్ల మేర్సీ వేరే ప్రాంతానికి బదిలీ అయ్యే అవకాశం ఉంది.

టిడిపి నాయకులతో కోడెల శివరాం సమావేశం

ప్రజాశక్తి-సత్తెనపల్లి రూరల్

సత్తెనపల్లి నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ నాయకులు కోడెల శివరాం నియోజకవర్గ నేతలతో బుధవారం రాత్రి సమావేశం నిర్వహించారు. మాజీ మంత్రి టిడిపి నేత కన్నా లక్ష్మినారాయణ ను నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జిగా నియమించిన నేపథ్యంలో కోడెల శివ రాం నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. సత్తెనపల్లి రఘురాంనగర్ లో ఉన్న కోడెల కార్యాలయంలో సత్తెనపల్లి మండలం రాజుపాలెం ముప్పాళ్ళ నకరికల్లు మండలాలకు చెందిన సుమారు 70 మంది టిడిపి నాయకులతో సమావేశం నిర్వహించారు. కన్నా కు ఇంచార్జి పదవి ఇవ్వటంతో అధినేత పై కోడెల శివరాం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ క్రమంలో నాయకులతో సమావేశం నిర్వహించటం రాజకీయ ప్రాధాన్యత సంతరించుకుంది.

విశ్వేశ్వరరావుకు టిడిపి నివాళి

ప్రజాశక్తి-అచ్చంపేట

కార్యకర్త స్థాయి నుండి జిల్లా స్థాయి నాయకుడిగా క్రమశిక్షణతో మెలిగిన వ్యక్తి విశ్వేశ్వరరావు అని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మలపాటి శ్రీధర్ అన్నారు బుధవారం అచ్చంపేట మండల కేంద్రంలో విశ్వేశ్వరరావు ప్రథమ వర్ధంతి సందర్భంగా తెనాలి మాజీ ఎమ్మెల్యే ఆలపాటి రాజేంద్రప్రసాద్ గుంటూరు మార్కెట్ మాజీ చైర్మన్ వెన్న సాంబశివరెడ్డి పాల్గొన్నారు అనంతరం రాయుడి విశ్వేశ్వరరావు విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు

ఎజెండాలోని అంశాలన్నీ ఆమోదం


ప్రజాశక్తి - మాచర్ల

మున్సిపల్ చైర్మన్ బోయ రఘురామిరెడ్డి అధ్యక్షతన కౌన్సిల్ సాధారణ సమావేశం బుధవారం కౌన్సిల్ హాల్లో జరిగింది అజెండాలో 18 అంశాలు ఏకగ్రీవంగా ఆమోదించారు పట్టణంలో టాయిలెట్ల సమస్య పార్కింగ్ సమస్యపై పలువురు కౌన్సిలర్లు ప్రశ్నించగా అవి త్వర లోనే పరిష్కారం అవుతాయని చైర్మన్ తెలిపారు.

సినీ నటుడు కృష్ణకు నివాళి

ప్రజాశక్తి - నరసరావుపేట

తెలుగు ప్రేక్షకుల మదిలో ఎప్పటికి నిలిచి ఉండే నటుడు సూపర్‌స్టార్ కృష్ణ అని ఎమ్మెల్యే డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి అన్నారు. కృష్ణ 81వ జయంతి సందర్భంగా స్థానిక 9వ వార్డులోని 'ఓల్డ్ ఏజ్ హోమ్స్' వృద్ధాశ్రమంలో నరసరావుపేట పట్టణ సూపర్ స్టార్ కృష్ణ, మహేష్ బాబు, యువశక్తి ఫారుక్ బాబు అండ్ ఫ్రెండ్స్ సర్కిల్ ఫ్యాన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా కేక్ కట్ చేసి వృద్ధులకు పంచి పెట్టారు.


వేడుకల్లో పాల్గొన్న మాజీ మంత్రులు రాజేంద్రప్రసాద్, ఆనందబాబు

సూపర్‌స్టార్ కృష్ణకు ఘన నివాళి

ప్రజాశక్తి-తెనాలి

సినీ నటుడు నటశేఖర్, సూపర్ స్టార్ కృష్ణ జయంతి వేడుకలను బుధవారం పట్టణంలో అభిమానులు ఘనంగా నిర్వహించారు. కౌన్సిల్ ప్రతిపక్ష నేత పసుపులేటి త్రిమూర్తి కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కృష్ణ జయంతి వేడుకల్లో మాజీ మంత్రులు ఆలపాటి రాజేంద్రప్రసాద్, నక్కా ఆనందబాబు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చలనచిత్ర రంగంలో సూపర్ స్టార్ కృష్ణది చెరగని ప్రస్తానమన్నారు. కృష్ణ సినీ జీవితం ఈ ప్రాంతానికే గర్వకారణమన్నారు. అనంతరం కృష్ణ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో కౌన్సిలర్లు దేశు యుగంధర్, బోయపాటి అరుణ, అన్నం పిన్నారావు, నాయకులు ఈదర వెంకటపూర్ణచంద్, జెట్టి రేణుక, కె.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు. స్థానిక చినరావూరు పార్కు వద్ద కృష్ణ అభిమానులు ఆయన జయంతి వేడుకలు నిర్వహించారు. చలి వేంద్రాన్ని ఏర్పాటు చేసి మజ్జిగ పంపిణీ చేశారు.

రోటరీ ఫౌండేషన్‌కు విరాళం

ప్రజాశక్తి-మంగళగిరి

రోటరీ క్లబ్ ఆఫ్ మంగళగిరి చార్టర్ ప్రెసిడెంట్ ఆర్‌టిఎన్ ఇసునూరు అనిల్ చక్రవర్తి రోటరీ ఫౌండేషన్ 1000 యుఎస్ డాలర్లు మన కరెన్సీలో రూ. 82,000ను వరుసగా మూడవ సంవత్సరం బుధవారం విరాళంగా ఇచ్చారు. అంతర్జాతీయ రేటింగ్ సంస్థ చారిటి నావిగేటర్ వారిచే వరుసగా 16 సార్లు అత్యుత్తమ 4 స్టార్ రేటింగ్ పొందిన అత్యున్నత సేవా సంస్థ రోటరీ ఫౌండేషన్ మాత్రమేనని, అలాంటి ఉత్తమ సంస్థ కు చేసే డొనేషన్లు సంపూర్ణంగా సద్వినియోగమవుతాయని, విరాళానికి సంబంధించిన చెక్‌ని క్లబ్ అధ్యక్షులుటి సతీష్ బాబు, క్లబ్ ఫౌండేషన్ డైరెక్టర్ నిరంజన్ గుప్తాకు అందజేశారు. కార్యక్రమంలో డిస్ట్రిక్ట్ 3150 ట్రైనర్ ఎ. రత్న ప్రభాకర్, కోశాధికారి జి.శ్రీనివాసరావు, సెక్రెటరీ ఎ.మురళీమోహన్ పాల్గొన్నారు.

ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి



ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పదోన్నతులో భాగంగా పొన్నూరు మండల పరిషత్ కార్యాలయంలో ఇఒపిఆర్‌డి విధులు నిర్వహిస్తున్న తనకు ఎంపిడిఒగా ఉద్యోగోన్నతి లభించినట్లు బుధవారం విలేకరుల సమా వేశంలో ఆయన తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లాలోని 15 మందికి ఎంపిడి ఒలుగా ఉద్యోగోన్నతి కల్పిస్తూ పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ కమిషనర్ ఎ.సూర్య కుమారి గతవారం ఉత్తర్వులు జారీ చేశారు.



చంద్రబాబుకు టిడిపి నాయకుల కృతజ్ఞతలు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు నారా చంద్రబాబు నాయుడు మహానాడు వేదికగా మేనిఫెస్టో ప్రకటించిన విషయం తెలిసిందే. ఇందులోని పథకాల గురించి, వాటి వల్ల ప్రజలకు కలిగే ప్రయోజనాల గురించి పొన్నూరు టిడిపి నాయకులు వివరించారు. చంద్రబాబుకు కృతజ్ఞతలు తెలిపారు.

మెల్లంపూడిలో ఉపాధ్యాయుల క్యాంపెయిన్



ప్రజాశక్తి-తాడేపల్లి రూరల్

ఎం టి ఎం సి పరిధిలోని మెల్లెంపూడి గ్రామంలో వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ ఉపాధ్యా యులు, వడ్డేశ్వరంలోని ప్రభుత్వ మహిళ కళాశాలలో విద్యా ర్థులను చేర్చాలని కోరుతూ బుధవారం క్యాంపియన్ నిర్వహిం చారు. కార్యక్రమంలో వడ్డేశ్వరం జడ్పీ హైస్కూల్ పాఠశాల ప్రధానోపాధ్యాయులు జి సుబ్బారావు, ఉపాధ్యాయులు కాకుమాను జోజప్ప, బుజ్జి బాబు, ఆనందరావు, రామచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.


ఎర్రబాలెంలో..



ఫిరంగిపురంలో..

పోరాటాలతోనే కార్మికుల సమస్యలు పరిష్కారం

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిఐటియు ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా రాజధానిలోని ఎర్రబాలెంలో సిఐటియు పతాకాన్ని బుధవారం సిఐటియు రాజధాని డివిజన్ అధ్యక్షులు ఎం.రవి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రవి మాట్లా డుతూ కార్మికుల ఐక్యత, పోరాటాలతోనే సమస్యలు పరిష్కార ం లభిస్తుందని అన్నారు. ఐక్యత- పోరాటం నినాదంతో కార్మిక వర్గ సమస్యలపై నికరంగా నిలిచి సిఐటియు పని చేస్తుందని చెప్పారు. లేబర్ కోడ్ లకు వ్యతిరేకంగా సిఐటియు పోరాడుతోందని, కార్మికులకు ఉరితాళ్లుగా మారే లేబర్ కోడ్‌లను కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీసుకువచ్చిందని మండిపడ్డారు. కార్మికులు ఎన్నో పోరాటాలు చేసి సాధించుకున్న కార్మిక చట్టాలను బిజెపి ప్రభుత్వం తుంగలో తొక్కుతుందని విమర్శించారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేటు వ్యక్తులకు కారుచౌకగా దారాదత్తం చేస్తున్నారని, ప్రశ్నించిన వారిని నిర్బంధిస్తున్నారని అన్నారు. కార్మిక వర్గాన్ని అణిచి వేసేందుకు ప్రయత్నిస్తున్న బిజెపిని ఇంటికి పంపిస్తేనే కార్మిక వర్గానికి మనుగడ అని అన్నారు. ఎన్ని ఆటంకాలు, ఇబ్బందులు ఎదురైన కార్మిక వర్గ ప్రయోజనాల కోసం నికరంగా సిఐటియు నిలబడిందని చెప్పారు. రాజధాని లోని వివిధ కార్మికుల సమస్యలపై నిరంతరం పనిచేస్తోందని, సిఐటియు ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని రాజధానిలోని కార్మిక వర్గం ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కారమయ్యే వరకూ వారికి అండగా నిలబడుతుందని చెప్పారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు రామారావు, ఆదిలక్ష్మి పాల్గొన్నారు.

సిఐటియు పతాకావిష్కరణ

ప్రజాశక్తి-ఫిరంగిపురం

ఫిరంగిపురం మండలంలోని స్థానిక పంచాయతి కార్మికుల ఆధ్వర్యంలో సిఐటియు 53వ వార్షికోత్సవ పతాకావిష్కరణ బుధవారం జరిగింది. ఫిరంగి పురం మండలం సిఐటియు కార్యదర్శి షేక్ మస్తాన్ వలి,, సతీష్ సిహెచ్ రామారావు ఇబ్రహీం అనూక్ బాలయ్య ఫిరంగిపురం గ్రామపంచాయతీ కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల పట్టాల పంపిణీ

ప్రజాశక్తి - మంగళగిరి రూరల్

సిఆర్‌డిఎ పరిధిలోని కష్టాయపాలెం లేఅవుట్ లో బుధవారం వడ్డేశ్వరం, మెల్లంపూడి గ్రామాలకు చెందిన సుమారు 400 మంది లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామ కృష్ణారెడ్డి ఇళ్ల పట్టాల ను పంపిణీ చేశారు. పేదలకు సొంతిల్లు ఉండాలని ఉద్దేశంతో రాష్ట్ర ముఖ్యమంత్రి చేసిన ఆలోచనకు ప్రతి రూపమే ఈ ఇళ్ల స్థలాలు పంపిణీ అని ఆయన వ్యాఖ్యానించారు.


పట్టా అందజేస్తున్న ఎమ్మెల్యే ఆర్కే

రైల్వే స్థలంలోని ఆక్రమణల తొలగింపు

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు పట్టణంలోని రైల్వే స్టేషన్ దగ్గర ఉన్న ఆక్రమణల ఇళ్లను తొలగింపు కార్యక్రమం మంగళవారం చేపట్టారు. దక్షిణ మధ్య రైల్వే లైను ఆధునీకరణ భాగం లో తెనాలి-బాపట్ల మధ్య రైల్వే స్థలాలలో ఉన్న ఆక్ర మణల ఇళ్లను తొలగిస్తున్నట్లు రైల్వే ఎగ్జిక్యూటివ్ ఇంజ నీర్ మణికంఠ తెలిపారు రైల్వే అధికారులతో పాటు రైల్వే పోలీసులు స్థానిక అర్బన్ పోలీసుల నేతృత్వంలో ఆక్ర మణలను తొలగించారు. ఎటువంటి అల్లర్లు జరగకుండా బందోబస్తు ఏర్పాటు చేశారు.



ఆగ్రహించిన మహిళలు

నిడుబ్రోలు రైల్వే ట్రాక్ సమీపంలోని ఇళ్ల తొలగింపుపై మహిళలు పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టారు. తమకు సామాన్లు సర్దుకునే సమయం కూడా ఇవ్వలేదని అధికారులపై మండిపడ్డారు. త్వరలో ఇళ్లు ఖాళీ చేసి వెళతామని విన్నవించినప్పటికీ రైల్వే అధికారులు ఏకపక్ష ధోరణితో వ్యవహరించారని, తమ ఇళ్ళను కూల్చివేయటం దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు.

ప్రతి ఒక్కరూ మ్యాజిక్ నేర్చుకోవచ్చు

ప్రజాశక్తి-పెదకాకాని

ప్రయత్నిస్తే ప్రతి ఒక్కరూ మ్యాజిక్ నేర్చుకోవచ్చని రిటైర్డ్ ఎంపి డిఒ, జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆదినారాయణ అన్నారు. వేసవి విజ్ఞాన శిబిరాలలో భాగంగా స్థానిక గ్రంథాలయంలో బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో ఆయన పాల్గొ న్నారు. శిబిరానికి 49 మంది విద్యా ర్థులు హాజరయ్యారు. విద్యార్థులతో కథలు చదివించడం, కథలు చెప్పించడం, లూడో, చెస్, బిజినెస్, వైకుంఠపాళి మొదలైన గేమ్స్ ఆడించారు. 'చదవడం మాకిష్టం' అనే కార్యక్రమంలో పాల్గొన్న ఆదినారాయణ మ్యాజిక్, అంకెలతో వింతలు, వింత ఫజిల్స్, కథలు, ఆటలతో పిల్లలను అలరించారు. మ్యాజిక్‌లో భాగంగా అర చేతిలో కర్పూరం వెలిగించడం, వైట్ పేపర్‌తో రూ.2,000 తయారు చేయడం మొదలైనవి చేసి చూపించడమే కాకుండా విద్యార్థులతో కూడా చేయించారు. వీటి వెనుక ఎటువంటి మాయలు, మం త్రాలూ లేవని ఉన్న దంతా సైన్స్ అని వారికి వివరించారు. చిన్నచిన్న ట్రిక్కులను వారి చేత చేయించారు. విద్యార్థుల ప్రతి ఒక్కరూ ఈ సమ్మర్ క్యాంపును సద్వి నియోగం చేసుకొని విజ్ఞానం పెంపొందించు కోవాలని సూచించారు. ప్రతి ఒక్క విద్యార్థీ గ్రంథా లయం లో సభ్యత్వం తీసు కోవాల్సిందిగా కోరారు. గ్రంథాలయాల్లో సభ్య త్వం తీసుకోవడం వలన కలిగే ప్రయో జనాలను విద్యార్థులకు వివరించారు. ఈ కార్యక్రమంలో గ్రంథా లయా ధికారి వి. విజయ్‌కుమార్, రిసోర్స్ పర్సన్స్ జి. వెన్నెల, ఎల్.జెస్సి, ఎల్. బ్లేస్సి పాల్గొన్నారు.


మ్యాజిక్ చేస్తున్న జన విజ్ఞాన వేదిక జిల్లా నాయకులు ఆదినారాయణ

పెదనందిపాడు ఆసుపత్రిలో తనిఖీ

ప్రజాశక్తి-పెదనందిపాడు

పెదనందిపాడు ప్రభుత్వ ఆసుపత్రిని బుధవారం డిఐఒ కెవి సుబ్బారాజు ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. రికార్డులను పరిశీలించారు, ఆసుపత్రిలో అందుతున్న వైద్య సేవలపై సంతృప్తి వ్యక్తం చేశారు, ఆసుపత్రి బిల్డింగ్ పాతబడటంతో ఆసుపత్రి స్థలంలోనే నూతన బిల్డింగ్ నిర్మాణం కోసం ప్రభుత్వ అనుమతి లభించినట్లు చెప్పారు. కార్య క్రమంలో డాక్టర్లు బి.విజయ రత్నకుమార్, ఎస్.నందకుమార్, సిహెచ్ఒ ప్రసాద్ స్వామి, ఎంపిహెచ్ఎస్ అప్పారావు, ఆసుపత్రి సిబ్బంది పాల్గొన్నారు.


రికార్డులను పరిశీలిస్తున్న డిఐఒ కె.వి సుబ్బరాజు



'ఇంగ్లీషు' ప్రాధాన్యతను గుర్తించండి

ప్రజాశక్తి - ఫిరంగిపురం

పొనుగుపాడులో గ్రామ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఉచిత ఇంగ్లీష్ సమ్మర్ కోచింగ్ ముగింపు సందర్భంగా బుధవారం సభ నిర్వహించారు. కోయ రామారావు కుటుంబ సభ్యుల సౌజ న్యంతో నిర్వహించిన ఈ సభకు గ్రామ అభివృద్ధి కమిటి సభ్యులు షేక్ మస్తాన్ వలి అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా నాగార్జున యూనివర్సిటీ మాజీ ప్రొఫెసర్ డాక్టర్ పాతూరు సీతారామాంజనేయులు, శ్రీ కాశీ విశ్వేశ్వర స్వామి వారి దేవస్థాన కమిటీ సభ్యులు వంకాయలపాటి సూర్య నారాయణ హాజరయ్యారు. సీతారామాంజనేయులు మాట్లా డుతూ వేలకు వేల రూపాయలు ఖర్చు పెట్టి ఇంగ్లీష్ నేర్చు కుంటున్నారని, గ్రామంలో ఉచితంగా ఇంగ్లీష్ సమ్మర్ కోచింగ్ నిర్వహించడం అభినందనీయమని ప్రశంసించారు. ఇంగ్లీషు ప్రాధాన్యతను విద్యార్థుల తల్లిదండ్రులు గుర్తించి వారి పిల్లలను ఈ కోచింగ్ సెంటర్‌కు పంపాలని సూచించారు. సెల్‌ఫోన్, టివిల ప్రభావతంతో నేడు బాల, బాలికలు తప్పుదోవపడుతున్నారని అన్నారు. అనంతరం వంకాయలపాటి సూర్యనారాయణ మాట్లాడారు. ఆంగ్ల ఉపాధ్యాయుడు అశోక్‌ను శాలువా కప్పి సన్మానించారు. ఫస్ట్ ర్యాంక్, సెకండ్ ర్యాంక్, థర్డ్ ర్యాంక్ సంపాదించిన బాల బాలికలకు బహుమతి ప్రదానం చేశారు.



బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ అన్నదానం

ప్రజాశక్తి-పొన్నూరు రూరల్

పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం నిరుపేదలకు అన్నదానం చేశారు. పొన్నూరు మండలానికి చెందిన చెరుకూరి రమేష్, రమాదేవిల కుమారుడు త్రిలోక్ పుట్టినరోజు సం దర్భంగా వారి సహాయ సహకారాలతో ఈ అన్నదానం చేశారు. నిడుబ్రోలు రైల్వే స్టేషన్ దగ్గర, పలు చోట్ల సాధువులకు, నిరాశ్రయులకు,వృద్ధులకు భోజనం, వాటర్ బాటిల్స్, బిస్కెట్లు అందజేశారు.ఈ కార్యక్రమంలో పొన్నూరు బ్లడ్ వెల్ఫేర్ అసోసియేషన్ సంస్థ అధ్యక్షుడు టి.ఉమాశంకర్, కార్యదర్శి జి. పవన్, సిహెచ్ అనిల్, జి.సురేష్, రమేష్ దంపతులు పాల్గొన్నారు. అన్నదానం, రక్తదానం చేయాలనుకునే వారు 8333089722 నంబరులో సంప్రదించాల్సిందిగా సంస్థ ప్రతినిధులు తెలిపారు.

యువత స్టార్టప్‌ల వైపు దృష్టి సారించాలి

కెఎల్‌యు ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్

ప్రజాశక్తి -తాడేపల్లి రూరల్

యువత నూతన స్టార్టప్ లవైపు దృష్టి సారించాలని కెఎల్ విశ్వ విద్యాలయ ప్రొఫెసర్ వైస్ చాన్సులర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్ విద్యార్థులకు పిలుపునిచ్చారు. బుధవారం వర్శిటీలోని జాస్మిన్ హాలులో కెఎల్ టెక్నాలజీ ఇంక్యుబేటర్స్ ఫౌండేషన్, టెక్నాలజీ బిజినెస్ ఇంక్యుబేటర్ విభాగాలు నిర్వహించిన అమృత్ కాల్ అధ్యాయ్ అనే కార్యక్రమంలో ప్రసంగించారు. ఇండియన్ ఆయిల్ కార్పోరేషన్ తలపెట్టిన వినూత్న సాంకేతికత, వ్యాపార ప్రక్రియ, రీ ఇంజనీరింగ్ ఆలోచనలను స్థాపించే వారికి నిధులను కేటాయించే అవకాశాల గురించి ఆయన వివరించారు. కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఇన్ఫర్మేషన్ టెక్నాలజీ ఇంక్యుబేషన్ అండ్ డెవలెప్మెంట్ ఆఫ్ ఎంటర్ ప్రెన్యూర్స్ కార్యక్రమంలో ప్రారంభ దశ స్టార్టప్‌ల కోసం కెఎల్ విశ్వవిద్యాలయానికి నిధులు కేటాయింస్తున్నట్లు తెలిపారు. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా పరిశోధన మరియు అభివృద్ధి డైరెక్టర్ డాక్టర్ ఎస్.వి. రామ కుమార్ మాట్లాడుతూ హైడ్రో కార్బన్ సెక్టార్‌లో స్టార్టప్ ఐడియాల కోసం ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ నుండి నిధుల అవకాశాల గురించి విధ్యార్థులకు వివరించారు. అందుకోసం గత మార్చిలో ఆన్ లైన్ ద్వారా ధరఖాస్తులను కోరినట్లు తెలిపారు. నూతనంగా స్టార్టప్ లను ప్రారంభించే వారికి ఇది ఒక మంచి అవకాశమని పేర్కొన్నారు. కార్యక్రమంలో విశ్వవిద్యాలయ వైస్ చాన్సలర్ డాక్టర్ జి.పార్ధసారధి వర్మ, ప్రొఫెసర్ వైస్ ఛాన్సలర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, కెఎల్ స్టార్టప్ ముఖ్య అధికారి గోవిల్ అలోక్, సెంటర్ ఫర్ ఇన్నోవేషన్, ఇంక్యుబేషన్ మరియు ఎంట్రప్రెన్యూర్‌షిప్ డైరెక్టర్ డాక్టర్ కె రాజశేఖర్, మేనేజర్ డాక్టర్ సన్నీ అగర్వాల్ తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న కెఎల్‌యు ప్రొఫెసర్ డాక్టర్ ఎవిఎస్ ప్రసాద్


కౌన్సిల్‌లో అధికార, ప్రతిపక్ష కౌన్సిలర్లు

తెనాలి కౌన్సిల్ నుండి టిడిపి వాకౌట్

కౌన్సిలర్‌పై దాడి ఘటన నివేదిక వెల్లడించాలని డిమాండ్

ప్రజాశక్తి-తెనాలి:

కౌన్సిల్‌లో టిడిపి సభ్యునిపై దాడి ఘటనపై కమిటీ నివేదిక ఏమైంది? బహిర్గతం చేయండి అంటూ బుధవారం కౌన్సిల్ సమావేశంలో ప్రతిపక్ష నేత పసుపులేటి త్రిమూర్తి నిలదీశారు. అధికార పక్షం నుంచి సరైన సమాధానం లేకపోవటంతో వారంతా సమావేశం నుంచి వాకౌట్ చేశారు. మున్సిపల్ కౌన్సిల్ హాల్‌లో చైర్‌పర్సన్ సయ్యద్ ఖలేదా నశీం అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరిగింది. అజెండా అంశాల చర్చకు ముందే మార్చి 29న కౌన్సిల్‌లో టిడిపి సభ్యుడు దేశు యుగంధర్‌పై జరిగిన దాడి ఘటనపై చైర్‌పర్సన్ కమిటీ వేశారు కదా? దాని నివేదిక బహిర్గతం చేయండి అంటూ త్రిమూర్తి ప్రశ్నించారు. ఈ నేపథ్యంలో చైర్‌పర్సన్ స్పందించి, కమిటీలో సభ్యుడైన తాడిబోయిన రామయ్యను ప్రశ్నించారు. కమిటీ విచారణ ఎంత వరకు వచ్చిందో చెప్పాలని కోరగా, విచారణకు సభ్యులు ఎవరూ సహకరించకపోవటంతో ఏమి చేయలేకపోయామని రామయ్య బదులిచ్చారు. దీనిపై టిడిప, వైసిపి కౌన్సిలర్ల మధ్య స్వల్ప వాగ్వివాదం జరిగింది. కౌన్సిల్‌లో ఏం జరిగిందన్నది సిసిటివి, మీడియా కవరేజ్ ఫుటేజిలో ఉందని, దానికి విచారణ కమిటీ కూడా అవసరం లేదని, బాధ్యులపై ఎందుకు చర్యలు తీసుకోరంటూ చైర్‌పర్సన్‌ను ప్రశ్నించారు. ఆమె నుంచి స్పందన లేకపోవటంతో టిడిపి కౌన్సిలర్లు సమావేశం నుంచి వాకౌట్ చేశారు. అనంతరం వైసిపి కౌన్సిలర్లు నత్త నడకన సాగుతున్న అభివృద్ధి పనులపై ప్రశ్నించి, వారు కూడా ఒకొక్కరుగా సమావేశం నుంచి నిష్క్రమించారు. దీంతో అజెండా అంశాలు ఆమోదిస్తూ, సమావేశం ముగిసినట్లు చైర్‌పర్సన్ ప్రకటంచారు. సమావేశంలో కమిషనర్ ఎం.జస్వంతరావు, వివిధ విభాగాల అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

క్యాంపస్ సెలక్షన్స్‌లో గుప్త కళాశాల విద్యార్థులకు ఉద్యోగాలు

ప్రజాశక్తి-తెనాలి

స్థానిక లక్ష్మీ డీలక్స్ కూడలిలోని ఎన్ఆర్‌కె అండ్ కేఎస్సార్ గుప్తా డిగ్రీ కళాశాల విద్యార్థులు క్యాంపస్ సెలక్షన్లలో ఉద్యోగాలు పొందారు. కళాశాల్లో బుధవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ప్రిన్సిపల్ గోగినేని విజయకృష్ణ వివరాలు వెల్లడించారు. ఫిన్ కేర్ ప్రైవేటు బ్యాంకులో సెంటర్ మేనేజర్ ఉద్యోగాలకు ఆ సంస్థ ప్రతి నిధులు రెండు రోజులపాటు ఎంపిక ప్రక్రియ చేపట్టారన్నారు. దీనిలో కళాశాల్లో బిఎస్సీ, బికాం ఫైనలియర్ చదువుతున్న విద్యార్థులు 22 మంది ఉద్యోగాలకు ఎంపికయ్యారన్నారు. ఎంపికైన వారికి వార్షిక వేతనంతోపాటు ఇతర అలవెన్సులు చెల్లిస్తామని బ్యాంక్ హెచ్ఆర్ మేనేజర్ జె.రాజీవ్ చెప్పారు. ఉద్యోగాలు పొందిన వారిని ప్రిన్సిపల్‌తో పాటు పొట్టిశ్రీరాములు విద్యాసంస్థల అధ్యక్షులు నంబూరు వెంకటకృష్ణ మూర్తి, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ నూకల వెంకటవేణుగోపాలరావు, మేనేజర్ డి.శ్రీనివాసరావు అభినందించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఎం.దశరధరామిరెడ్డి, కెవి రవికుమార్, ఎస్‌కె రఫి, ఎ.నాగరాజు, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ అశ్వని పాల్గొన్నారు.


ఉద్యోగాలు పొందిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

వర్సిటీని సందర్శించిన ఆర్.నారాయణమూర్తి

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ప్రముఖ చలన చిత్ర నటులు ఆర్. నారాయణ మూర్తి బుధవారం ఆచార్య నాగార్జున విశ్వ విద్యాలయాన్ని సందర్శించారు. విసి ఆచార్య పి. రాజశేఖర్‌ని మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పి. రాజశేఖర్ ఆర్ నారాయణ మూర్తిని సన్మానించి గౌతమ బుద్ధుని జ్ఞాపికను అందజేశారు. కార్యక్రమంలో రెక్టార్ ఆచార్య పి. వర ప్రసాద మూర్తి, రిజిస్ట్రార్ ఆచార్య బి .కరుణ, ఆర్ట్స్, ఇంజనీరింగ్ కళాశాలల ప్రిన్సిపాల్ ఆచార్య సీ హెచ్. స్వరూప రాణి, ఆచార్య సిద్దయ్య, ఆచార్య వెంకటేశ్వర రావు, సీడీసీ డీన్ ఆచార్య కె. మధుబాబు, ఇంజినీర్ కుమార్ రాజా పాల్గొన్నారు.


ప్రముఖ నటులు ఆర్ నారాయణ మూర్తిని సన్మానిస్తున్న విసి తదితరులు

వర్సిటీలో పీసెట్ దేహదారుఢ్య పరీక్షలు

తొలిరోజు 340 మంది హాజరు

ప్రజాశక్తి - ఎఎన్‌యు

ఆచార్య నాగార్జున యూనివర్సిటీ లో నిర్వహిస్తున్న ఏపీ పీ సెట్ 2023 దేహదారుఢ్య పరీక్షలు బుధవారం ప్రారంభ మయ్యాయి. ఉన్నత విద్యా మండలి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ ప్రవేశ పరీక్షలును కౌన్సిల్ స్పెషల్ ఆఫీసర్ డాక్టర్ ఎం సుధీర్ రెడ్డి పరిశీలించారు. మొదటి రోజు పరీక్షలకు 460 మంది హాజరు కావాల్సి ఉండగా 340 మంది హాజరైనట్లు పీసెట్ కన్వీనర్ పిపిఎస్ పాల్ కుమార్ తెలిపారు.





సుమేధా హైస్కూల్ నూతన బ్రాంచ్ ప్రారంభం

ప్రజాశక్తి-గుంటూరు

గుంటూరు నగరంలోని ఏటి అగ్రహారం ఏడవ లైన్‌లో సుమేధా హైస్కూల్ వారి సుమేధా ప్రైమరీ స్కూల్ బ్రాంచ్ బుధవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా అపెక్స్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ డైరెక్టర్ నాగేశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమేధా హైస్కూల్ యాజమాన్యం ప్రతి విద్యార్థికి విలువలతో కూడిన విద్యను అందిస్తూ తక్కువ కాలంలోనే మంచి ఘనత సాధించాలని ఆకాంక్షించారు. భవిష్యత్తులో మరిన్ని బ్రాంచ్‌లతో ఉన్నత స్థానానికి ఎదగాలన్నారు. 2023 10వ తరగతి ఫలితాల్లో సుమేధా హైస్కూల్ విద్యార్థి గుంటూరు నగరంలోనే 593 మార్కులు సాధించి నగరంలోని మొదటి స్థానం సాధించడం అభినందనీయమన్నారు. ఇంతటి ఘనత సాధించిన యాజమాన్యానికి, ఉపాధ్యాయులకు అభినందనలు తెలిపారు. స్కూల్ డైరెక్టర్ చంద్రశేఖర్‌రెడ్డి మాట్లాడుతూ తమకు విద్యార్థులు, తల్లిదండ్రులు ఇన్నేళ్ళ సహకరించి తమ విద్యాసంస్థ అభ్యున్నతికి ఎంతో సహకరించారని చెప్పారు. ఇకమీదటా అదే సహకారం అందించి తమ విద్యాసేవ లను మరింత విస్తృ తం చేయడానికి తోడ్పడాలని కోరారు. బుధవారం నుండి అడ్మిషన్ల ప్రక్రియ ప్రారంభి స్తున్నట్లు వెల్లడించారు. కార్యక్రమంలో మాస్టర్ మైండ్స్ లెక్చరర్ రఫి, ఉపాధ్యాయిని, ఉపాధ్యా యులు, విద్యార్థులు పాల్గొన్నారు.


నూతన బ్రాంచ్‌ని ప్రారంభిస్తున్న నాగేశ్వరరావు

హావెల్స్, గుడ్‌విల్ ఎంటర్‌ప్రైజెస్‌కు కమిషన్ వడ్డింపు

ప్రజాశక్తి-గుంటూరు లీగల్ :నాసిరకం ఫ్యాన్ అంటగట్టి, వినియోగదారుడి గాయాలకు కారణమైన గుడ్‌విల్ ఎంటర్‌ప్రైజెస్‌కు, హావెల్స్ ఇండియా లిమిటెడ్ బాధితుడికి వినియోగదారుల కమిషన్ రూ.32వేలు చెల్లించాలని బుధవారం తీర్పు వెలువరించింది. గుంటూరు దేవాపురంకు చెందిన గిద్దలూరి రంగారావు హావెల్స్ కంపెనీకి చెందిన స్టాండ్ ఫ్యాన్ 2022 ఏప్రిల్ 19వ తేదీన రూ.4వేలు ఇచ్చి, గుంటూరు జిన్నాటవర్ సెంటర్‌లోని గుడ్‌విల్ ఎంటర్‌ప్రైజెస్‌లో కొనుగోలు చేశారు. ఫ్యాన్ ఇంటికి తీసుకెళ్లిన తర్వాత రంగారావు నిద్రలో ఉండగా మే 9న ఫ్యాన్ అతని చేయిపై పడి దెబ్బలు తగిలాయి. వెంటనే హాస్పిటల్‌కు వెళ్లి చికిత్స తీసుకోగా రూ.10వేలు ఖర్చు అయ్యింది. ఈ విషయాన్ని గుడ్‌విల్ ఎంటర్‌ప్రైజెస్‌కు తెలియజేయగా కొత్త ఫ్యాన్ ఇచ్చారు. అయితే చికిత్సకు అయిన ఖర్చు ఇవ్వాలని రంగారావు కోరగా నిరాకరించారు. దీంతో బాదితుడు జిల్లా వినియోగదారుల కమిషన్‌ను ఆశ్రయించారు. దీంతో ఇరువురి వాదనలూ విన్న వినియోగదారుల కమిషన్ అధ్యక్షులు టి.సునీత, కమిషన్ సభ్యులు కె.విజయలక్ష్మి, జి.పున్నారెడ్డి గుడ్‌విల్ ఎంటర్‌ప్రైజెస్, హావెల్స్ ఇండియా కంపెనీ సంయుక్తంగా బాధితుడికి వైద్య ఖర్చుల కోసం రూ.5వేలు, నష్ట పరిహారం కింద రూ.25వేలు, కోర్టు ఖర్చుల కింద రూ.2వేలు, తీర్పు వెలువరించిన 6 నెలల్లోగా చెల్లించాలని బుధవారం తీర్పునిచ్చారు. లేని ఎడల 9శాతం వడ్డీతో కలిపి చెల్లించాల్సి ఉంటుందన్నారు.


గుంటూరులో జింక పట్టివేత

ప్రజాశక్తి-గుంటూరుజిల్లా ప్రతినిధి

గుంటూరు రూరల్ మండలం పరిధిలోని రత్నగిరి కాలనీ పంట పొలాల్లో అటవీశాఖ అధికారులు బుధవారం జింకను పట్టుకున్నారు. పల్నాడు జిల్లా అమరావతి మండలం లేమల్లే అటవీ ప్రాంతం నుండి నీటికోసం వచ్చినట్లుగా అటవీశాఖ అధికారి సంతోష్ కుమార్ తెలిపారు. స్ట్రైకింగ్ ఫోర్స్ సభ్యులు సతీష్ కుమార్,అబ్దుల్ రహీం లతో పాటు,స్థానికుల సహాయంతో వలపన్ని పట్టుకున్న అధికారులు. ప్రథమ చికిత్స అనంతరం నరసరావపేట సమీపంలో గల అటవీ ప్రాంతంలో విడిచిపెట్టనున్నట్లు ఆయన తెలిపారు. వేసవిలో దాహార్తి కోసం దారితప్పి వచ్చిన అటవీ జంతువులు కంట పడితే అధికారులకు సమాచారం ఇవ్వాలని ఆయన ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

ఇళ్ల మధ్య భారీ కొండచిలువ

ప్రజాశక్తి-తాడేపల్లి :పట్టణంలోని 15వ వార్డు పద్మశాలీ బజారులో 15 అడుగుల పొడవు గల కొండచిలువ హల్‌చల్ చేసింది. రోజూ రాత్రి తొమ్మిది గంటల సమయంలో కొండచిలువ తిరగడంతో పిల్లలతో పాటు పెద్దలు కూడా బెంబేలెత్తిపోయారు. బుధవారం రెండు పిల్ల కొండచిలువలు కనిపించడంతో ఒక దానిని స్థానికులు చంపేశారు. మరొకటి తప్పించు కుంది. ఇళ్ల మధ్య ఖాళీ స్థలంలో పెద్దఎత్తున పిచ్చి చెట్లు ఉండటంతో కొండ చిలువలకు ఆవాసంగా మారిందని స్థానికులు అంటున్నారు. ఫారెస్టు అధికారులకు కూడా సమాచారం ఇచ్చి కొండచిలువలు పట్టించాలని స్థానికులు భావిస్తున్నారు.



పొగాకుకు వ్యతిరేకంగా ర్యాలీ

ప్రజాశక్తి-గుంటూరు జిల్లా ప్రతినిధి

పొగాకు ఉత్పత్తుల గురించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ప్రభుత్వ వైద్య కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ యన్ ఉమాజ్యోతి అన్నారు. ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం సందర్భంగా బుధవారం జరిగిన ర్యాలీలో ఆమె మాట్లాడారు. పొగతాగటం మానుకో ఆరోగ్యాన్ని కాపాడు కో, జీవితాన్ని ఎంచుకోండి పొగాకును కాదు అంటూ నర్సింగ్ విద్యార్థినులు ర్యాలీ లో నినాదాలు చేశారు. పొగాకు వినియోగం వల్ల పలు వ్యాధులు సంక్రమించి ప్రాణానికే ముప్పు ఏర్పడుతుందని ఆమె హెచ్చరించారు. ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి మాట్లాడుతూ పొగాకు వాడకం వల్ల కలిగే ఆరోగ్య సమస్యల గురించి వైద్యులను సంప్రదించి అవగాహన పెంచుకోవాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ శ్రావణ బాబు, మానసిక వైద్య విభాగం అసోసియేట్ ప్రొఫెసర్లు డాక్టర్ వి వి కిరణ్, డాక్టర్ సాయి కిరణ్, సాయి కష్ణ, నిమిష, శ్రీలక్ష్మి, పి నగజ్యోతి, మినిస్టీరియల్ స్టాఫ్ వెల్ఫేర్ అసోసియేషన్ అధ్యక్షులు యం జ్యోతి బాబు పాల్గొన్నారు.



జిజిహెచ్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న నర్సింగ్ విద్యార్థులు